RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 6 డిసెంబర్ 2025 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:157




## ఇండిగో సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం

### సంక్షోభానికి కారకులైన వారిని గుర్తించి, 1బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరిక

న్యూ డిల్లీ డిసెంబర్ 5 ఇండిగో సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. సంక్షోభానికి కారకులైన వారిని గుర్తించి, బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించింది. సంక్షోభం నేపథ్యంలో ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది. ప్రయాణికులు 011 2461 0843, 2469 3963, 096503 91856 నంబర్లకు కాల్ చేయాలని సూచించింది. ఈ కంట్రోల్ రూం ద్వారా బాధితుల సమస్యలను పరిష్కరిస్తామని కేంద్రం తెలిపింది.ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను డీజీసీఏ సవరించడం సరికాదని కేంద్రం అభిప్రాయపడింది. డీజీసీఏ ఇచ్చిన ఎఫ్‌డీటీఎల్ ఆదేశాలను తక్షణమే నిలిపివేస్తున్నామని ప్రకటించింది. ప్రయాణికుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ప్రయాణికుల సంక్షేమం, భద్రత తమ బాధ్యత అని తెలిపింది. పరిస్థితులను వీలైనంత త్వరగా చక్కదిద్దుతామని.. మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. రద్దయిన విమాన సర్వీసులకు సంబంధించి ప్రయాణికులకు పూర్తి రీఫండ్ చేయాలని ఇండిగో సంస్థను ఆదేశించింది. ప్రయాణికులకు వసతి ఏర్పాట్లు చేయాలని సూచించింది.

## భారత్ తటస్థంగా లేదు అని, తాము శాంతి వైపు ఉన్నాం ఉక్రెయిన్-రష్యా సంక్షోభంపై ప్రధాని మోదీ



న్యూఢిల్లీ డిసెంబర్ 5 ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉక్రెయిన్-రష్యా సంక్షోభంపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. భారత్ తటస్థంగా లేదు అని, తాము శాంతి వైపు ఉన్నామని అన్నారు. ఢిల్లీలో శుక్రవారం హైదరాబాద్ హౌజ్‌లో పుతిన్‌తో జరిగిన సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చర్చల, దౌత్యం ద్వారా ఉక్రెయిన్ సంక్షోభానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని మోదీ పేర్కొన్నారు. ఆ సంక్షోభానికి శాంతియుత పరిష్కారాన్ని ఆశిస్తున్నామని, దానికే తమ మద్దతు ఉంటుందని ప్రధాని తెలిపారు. అయితే మోదీ వ్యాఖ్యలకు పుతిన్ స్పందించారు. ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న యుద్ధాన్ని ఆపేందుకు శాంతియుత పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నామని పుతిన్ తెలిపారు.శాంతి మార్గంలోనే ప్రపంచ సంక్షేమం ఉందన్నారు. కలిసికట్టుగా శాంతి కోసం మార్గాలు అన్వేషించాలన్నారు. గత కొన్ని రోజులుగా ఆ దిశగా చర్యలు జరుగుతున్నాయని, తనకు విశ్వాసం ఉందని, ప్రపంచంలో మళ్లీ శాంతి వికసిస్తుందని ఆశిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. అయితే ఉక్రెయిన్, రష్యా మధ్య ఉన్న సంక్షోభాన్ని పరిష్కరించేందుకు అమెరికా కూడా ప్రయత్నాలు చేపట్టింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పంపిన దౌత్యవేత్త విట్‌కాఫ్ కూడా కొన్ని రోజుల క్రితం పుతిన్‌తో చర్చలు జరిపారు.

## ఇండిగో పరిస్థితికి ప్రభుత్వ గుత్తాధిపత్యమే ప్రధాన కారణం : రాహుల్ గాంధీ



న్యూ డిల్లీ డిసెంబర్ 5 నిర్వహణపరమైన లోపాల వల్ల దేశంలోని అతి పెద్ద ఎయిర్‌లైన్ సంస్థ ఇండిగో విమాన సర్వీసులకు తీవ్ర ఆటంకం కలుగుతోన్న విషయం తెలిసిందే. గత మూడు రోజులుగా వందలాది విమానాలను సంస్థ రద్దు చేసింది నేడు కూడా దాదాపు 400కిపైగా విమానాలు రద్దయ్యాయి. ఇండిగోలో నెలకొన్న ఈ సంక్షోభంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తాజాగా స్పందించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.ఈ పరిస్థితికి ప్రభుత్వ గుత్తాధిపత్యమే ప్రధాన కారణమని ఆరోపించారు. ఎప్పటిలాగే జాప్యాలు, రద్దులు, నిస్సహాయతకు మూల్యం చెల్లించేది సాధారణ పౌరులే అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'ఇండిగో విమానాల రద్దు, అంతరాయాల కారణంగా దేశంలో విమానయాన రంగంలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఇండిగో వైఫల్యానికి ఈ ప్రభుత్వ గుత్తాధిపత్యమే ప్రధాన కారణం. ఎప్పటిలాగే జాప్యాలు, రద్దులు, నిస్సహాయతకు మూల్యం చెల్లించేది సాధారణ పౌరులే. ఇలాంటివి మరోసారి జరగకుండా ఉండేందుకు విమానయాన రంగంతో సహా అన్నింటిలోనూ న్యాయమైన పోటీ ఉండాలి. మ్యాచ్‌ఫిక్సింగ్, గుత్తాధిపత్యాలు కాదు' అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు. మరోవైపు ఈ పరిస్థితిపై పార్లమెంట్ సమావేశాల్లో చర్చ చేపట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

### పాన్ మసాలా తయారీ యునిట్లపై సెస్సు బిల్లుకు లోక్ సభ ఆమోదం

వార్తా 2 లో

### 63వ జాతీయ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

వార్తా 2 లో

# రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి









**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి డిసెంబర్ 05 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** మంత్రి దామోదర్ రాజనర్సింహ, జన్మదినన్ని పురస్కరించుకొని, శ్రీశైలం దేవస్థానం నుండి వచ్చిన, వేద పండితులు, సంగారెడ్డి లోని వైకుంఠపురం, ఆశ్రమం నుండి వచ్చిన వేద పఠన విద్యార్థులు, వచ్చి ఆశీర్వచనాలు మంత్రికి అందించారు, ఈరోజు ఉదయం నుండి, మంత్రి దామోదర్ రాజనర్సింహ అభిమానులు, నివాసానికి తండోప తండాలుగా తరలివచ్చి, వారి అభిమాన నాయకుడికి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, వేలాదిగా అభిమానులు తరలివచ్చిన, మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఓపికతో అభిమానులను కలిశారు, వారితో కలిసి సంబరాలు జరుపుకున్నారు, కేక్ లను కట్ చేశారు , తన నివాసానికి వచ్చిన వారితో కలిసి సంతోషాన్ని పంచుకున్నారు అనంతరం అందోల్- జోగిపేట, పట్టణంలో పర్యటించారు, తన పుట్టినరోజు సందర్భంగా జోగిపేట లో ఉన్న కస్తూర్బా, బాలికల విద్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో (కేజీబీవీ ) నర్సింగ్ విద్యార్థినీలతో కలిసి కేక్ కట్ చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు, మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వయంగా, విద్యార్థినులకు భోజనం వడ్డించారు, పర్యటనలో భాగంగా కార్యకర్తలు, అభిమానులు, జోగిపేట లోని శ్రీరామ గార్డెన్లో, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జన్మదిన వేడుకల కోసం, ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు, కార్యక్రమంలో భాగంగా, బాలాజీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో, ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును, బ్లడ్ డొనేషన్ క్యాంపు లను, ప్రారంభించారు, అనంతరం దివ్యాంగులకు, ట్రై సైకిల్స్ ను పంపిణీ చేశారు, తరలి వచ్చిన వేలాది మంది, మంత్రి దామోదర్ రాజనర్సిమను, గజమాలతో సత్కరించారు, భారీ బర్త్డే కేకును, తరలి వచ్చిన అభిమానుల సమక్షంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ కేక్ ను కట్ చేశారు, తరలివచ్చిన అభిమానులు, ఒక్కొక్కరు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా, సంజీవరెడ్డి, రాష్ట్ర చైర్మన్ గిరిధర్ రెడ్డి, మెదక్ డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మెదక్ సంగారెడ్డి జిల్లాల గ్రంథాలయ సమస్త అధ్యక్షులు, శ్రీమతి సుహాసిని రెడ్డి, అంజయ్య, మార్కెట్ కమిటీ అధ్యక్షులు, సుధాకర్ రెడ్డి, మక్త జగన్మోహన్ రెడ్డి, కొప్పుల లక్ష్మి శేషారెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు సురేందర్ గౌడ్, మార్కెఫైడ్ డైరెక్టర్ సేరి జగన్మోహన్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు....

# ప్రజాబలం

## 6 డిసెంబర్ 2025 శనివారం


## బంగారం.. జోస్యం... నిజమవుతుందా

బంగారం ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 53 శాతం పెరిగాయి. 2026లో 15 నుంచి 30 శాతం మధ్య పెరగవచ్చని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తెలిపింది. అమెరికా టారిఫ్‌లతో పాటు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల వేళ పసిడిలో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి.ఇన్వెస్టర్లు దీనిపై ఆసక్తి చూపడంతో పాటు పలు దేశాల సెంట్రల్ బ్యాంకులు కూడా బంగారం కొనుగోళ్లు చేస్తున్నాయి. అలాగే, ఆయా దేశాల బ్యాంకులు కీలక వడ్డీ రేట్లపై తీసుకున్న నిర్ణయాలు బంగారం ధరలు పెరిగేందుకు దోహదం చేశాయి.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న విధానపర నిర్ణయాలు విజయవంతమైతే బంగారం ధరలు తగ్గుముఖం పట్టవచ్చని డబ్ల్యూజీసీ చెప్పింది. ప్రపంచ ఆర్థిక అస్థిరత, ద్రవ్యోల్బణం, భౌగోళిక ఉద్రిక్తతలు గత కొన్ని సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లను కుదిపేశాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక లేదా రాజకీయ అనిశ్చితి పెరిగినప్పుడల్లా, ప్రజలు తమ డబ్బును సురక్షితంగా ఉంచుకోవడానికి చూస్తారు. అటువంటి పరిస్థితిలో, బంగారాన్ని ఎల్లప్పుడూ సురక్షితమైన స్వర్గధామంగా భావిస్తారు. అందుకే వ్యక్తులు, సంస్థలు స్టాక్ మార్కెట్ తిరోగమనం కంటే బంగారంపై నమ్మకం ఉంచుతున్నారు.మొదటి ప్రధాన కారణం ద్రవ్యోల్బణం. ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు, డబ్బు విలువ తగ్గడం ప్రారంభమవుతుంది. అందువల్ల, పెట్టుబడిదారులు తమ డబ్బును బంగారం వంటి స్థిరమైన ఆస్తులలో పెట్టుబడి పెట్టడానికి ఇష్టపడతారు. తద్వారా వారి పొదుపు విలువ తగ్గదు. అందుకే బంగారం డిమాండ్ పెరుగుతూనే ఉంటుంది.మరో ప్రధాన కారణం కేంద్ర బ్యాంకు కొనుగోళ్లు. గత కొన్ని సంవత్సరాలుగా, అనేక దేశాలలోని కేంద్ర బ్యాంకులు తమ విదేశీ మారక నిల్వలలో బంగారం వాటాను పెంచుకున్నాయి. ఉదాహరణకు, భారతదేశం, చైనా, రష్యా, టర్కీ వంటి దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలు డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించడానికి నిరంతరం టన్ను చొప్పున బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి.మూడవ కారణం ప్రపంచ రాజకీయ ఉద్రిక్తతలు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, చైనా-అమెరికా వాణిజ్య వివాదం, మధ్యప్రాచ్యంలో అస్థిరత వంటి పరిస్థితులు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని బంగారం వైపు మళ్లించాయి. 2008 మాంద్యం అయినా లేదా 2020 మహమ్మారి అయినా, ప్రతి సంక్షోభ సమయంలోనూ బంగారం సురక్షితమైన పెట్టుబడిగా నిరూపించబడిందని చరిత్ర చూపిస్తుంది.స్టాక్ మార్కెట్ అస్థిరంగా ఉన్నప్పుడు, ప్రజలు బంగారాన్ని నమ్మకమైన ఆస్తిగా భావిస్తారు. కేంద్ర బ్యాంకులు కూడా తమ కరెన్సీల స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయి. సగటు భారతీయుడికి, బంగారం కేవలం పెట్టుబడి మాత్రమే కాదు, సంప్రదాయం, భద్రత, ప్రతిష్టకు చిహ్నం.బంగారం ధర పెరుగుదలలో ఈటీఎఫ్‌లు కూడా కీలక పాత్ర పోషిస్తున్నట్లు వివరించింది. ఈ విధానంలో భారీగా పసిడిని కొనుగోలు చేస్తున్నారని చెప్పింది. గ్లోబల్‌గా బంగారం ఈటీఎఫ్‌ల్లోకి సుమారు రూ.6,93,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పింది. బంగారం ధరలు పెరగడానికి, తగ్గడానికి చాల అంశాలు తోడవుతాయి. ప్రపంచ రాజకీయ పరిస్థితులు సహా డాలరుతో రూపాయి విలువ కూడా బంగారం ధరల పై ప్రభావం చూపుతాయి. మరోవైపు ఈ ఏడాది మొత్తంగా చూస్తే బంగారం ధర భారీగా పెరిగింది. బంగారంతో పాటు వెండి కూడా కేజీ ధర లక్షకి చేరువలో ఉండగా, ప్రస్తుతం 2 లక్షలకి దగ్గరలో కొనసాగుతుంది.బంగారం కొనేందుకు చూస్తున్న కస్టమర్లకి ప్రస్తుతం ఈ ఏడాది చివరిలో బంగారం ధరల్లో పెద్దగా మార్పు ఉండబోదని నిపుణులు సూచిస్తున్నారు. అయితే వచ్చే ఏడాది ఈ స్థాయికి బంగారం, వెండి ధరలు చేరుకుంటాయో అని అంచనా వేస్తున్నారు. భారతీయ పెట్టుబడిదారులకు బంగారం ఒక దీర్ఘకాలిక ఆస్తిగా మిగిలిపోయింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో హెచ్చుతగ్గులు ఉన్న.. డిమాండ్ స్థిరంగా ఉంది. భవిష్యత్‌లో కూడా బంగారం ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు మరింత పెరిగవచ్చని అంచనా వేసింది. బంగారం ధరలు సామాన్యులను షాక్‌కు గురి చేస్తున్నాయి. ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గిస్తారనే అంచనాలతో గోల్డ్ రేట్లల్లో గత కొద్దిరోజుల్లో ఊహించని మార్పులు జరుగుతున్నాయి. నేడు బంగారం, వెండి ధరలు మళ్లీ పెరిగాయి. ఇవాళ తులం బంగారం రూ.1,30,580గా ఉండగా.. వెండి ధర రెండు లక్షల మార్క్‌ను దాటింది. హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.2,01,000 వద్ద కొనసాగుతోంది. రానున్న రోజుల్లో బంగారం ధరలు కూడా 2 లక్షలకు చేరుకునే అవకాశముందనే వార్తల క్రమంలో బంగారం వైపు చూడాలంటేనే సామాన్య, మధ్యతరగతి ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా పేరుపొందిన జ్యోతిష్యురాలు అయిన బాబా వంగా గతంలో గేల్డ్ రేట్లపై చెప్పిన జోస్యం ఇప్పుడు సంచలనంగా మారింది. ఆమె ఏం చెప్పారో ఇప్పుడు చూద్దాం.బాబా వంగా మరణించినప్పటికీ.. భవిష్యత్ గురించి ఆమె చెప్పినవన్నీ దాదాపు నిజమయ్యాయి. ఆమె అంచనా వేసినవన్నీ నిజమవుతున్నాయి. తాజాగా బంగారం రేట్లు భారీగా పెరుగుతుండటం, దాని గురించి ఎక్కువమంది చర్చించుకుంటున్న క్రమంలో ఈ విషయంపై బాబా వంగా ఏం చెప్పారనేది సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారింది. ఆమె అంచనా ప్రకారం.. గోల్డ్ రేట్లు ఊహించనంతగా పెరుగుతాయట. 2026 నాటికి ఏకంగా25 శాతం నుంచి 40 శాతం వరకు పెరిగే అవకాశం ఉందట. ప్రస్తుతం తులం బంగారం లక్షన్నరగా ఉండగా..2026 నాటికి 40 శాతం వరకు పెరగనున్నాయని బాబా వంగా అంచనాలు చెబుతున్నాయి.2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా ఆస్థిరంగా మారుతుందని, తీవ్రమైన సంక్షోభం ఏర్పడే అవకాశముందని బాబా వంగా అంచనా వేశారు. దీని వల్ల బ్యాంకింగ్ రంగానికి భారీగా నష్టం జరుగుతుందన్నారు. కరెన్సీ విలువ తగ్గిపోవడం, ద్రవ్యత తగ్గడంతో ఆర్థిక వ్యవస్థకు పెనుముప్పు ఏర్పడుతుందని తన అంచనాల్లో పేర్కొన్నారు. దీని వల్ల పెట్టుబడిదారులు బంగారం, వెండిపై ఇన్వెస్ట్ చేస్తారని, ఈ కారణాలతో ఊహించని విధంగా రేట్లు పెరుగుతాయని జోస్యం చెప్పారు.అలాగే 2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా భయంకరమైన తుఫాన్లు, సునామీలు, భూకంపాలు ఏర్పడాతాయని, ఇక గ్రహాంతరవాసులతో మానవులకు ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడతాయని అంచనా వేశారు. ఇక ఏఐ టెక్నాలజీ అత్యంత ప్రమాదకరంగా మారి మానవ మనుగుడకు ముప్పు తెస్తుందన్నారు.

# 'తెలంగాణ కోసం ఢిల్లీనైనా ఢీ కొడుతా

"తెలంగాణ అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తా. ఎవరితోనైనా కొట్లాడుతా.. ఢిల్లీనైనా ఢీ కొడుతా! నిధులు తీసుకొస్తా. అడగాడనికి వెనుకాడను. రాకపోతే కొట్లాడటానికి అసలే భయపడను. రాష్ట్రానికి కావలసిన నిధులు, రావలసిన అనుమతుల కోసం ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల వద్దకు వెళ్లి అడగడం ముఖ్యమంత్రిగా నా బాధ్యత. ఒకటికి వంద సార్లు తిరుగుతా. నాకు ఓపిక ఉంది. వయసుంది. విషయాన్ని వివరించే కనీస పరిజ్ఞానం నాకుంది. మీ ఆశీర్వాదం ఇలాగే ఉండాలి.." అని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి అన్నారు

కాకతీయ కాలం నుంచి ప్రపంచానికి పోరాట పంథాను చాటిచెప్పిన వరంగల్ గడ్డ, సమ్మక్క సారలమ్మ, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, కృష్ణమాచార్యులు, కాళోజీ నారాయణ రావు, పీవీ నర్సింహారావు గారి నుంచి తెలంగాణ మలిదశ ఉద్యమానికి నాయకత్వం వహించిన ప్రొ జయశంకర్ గార్లు ప్రజా ప్రభుత్వానికి స్ఫూర్తిగా నిలుస్తారు. వారి స్ఫూర్తిగానే ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు.

ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు కార్యక్రమాల్లో భాగంగా వరంగల్ జిల్లా నర్సంపేటలో రూ. 532.24 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి గారు మాట్లాడారు.

"నిరుపేదలు, దళిత, గిరిజన, ఆదివాసీ, మైనారిటీ పిల్లలు చదువుకుంటేనే భవిష్యత్తు ఉంటుంది. అవసరమైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన చదువులు అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. తాతముత్తాల కాలం పది తరాలుగా వృత్తులు చేసుకుంటూ వచ్చినా బతుకులు మారలేదు. చదువొక్కటే మన బతుకుల్లో మార్పు తీసుకొస్తుంది. నిలబెడుతుంది. ప్రపంచంతో పోటీ పడేలా చేస్తుంది.

ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అనేక సామాజిక అంశాలను పరిగణలోకి తీసుకుని.. ఒకవైపు రైతులు, మరోవైపు మహిళలు, ఇంకోవైపు యువత కోసం కార్యక్రమాలు చేపట్టింది. యువత కోసం ఉద్యోగ నియాకాలు చేపట్టాం. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది లోపే 61 వేల ఉద్యోగాలిచ్చాం. ఇంకా 40 వేల ఉద్యోగాలిచ్చే ప్రక్రియ మొదలవుతుంది.

అభివృద్ధి పథంలో సాగాలంటే ఎడ్యుకేషన్, ఇరిగేషన్, కమ్యునికేషన్ అత్యంత కీలకమని, ఆయా రంగాల్లో లక్ష్యాలను సాధించడానికి ఈ నెల 8, 9, తేదీల్లో ప్రపంచ స్థాయిలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ (%Telangana Rising Global Summఙ)ను నిర్వహిస్తున్నాం.

హైదరాబాద్‌తో సమంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలి. పక్క రాష్ట్రాల్లో నాలుగైదు విమానాశ్రయాలుంటే, తెలంగాణలో ఒక్కటి మాత్రమే ఉంది. పదేండ్లలో వీటి గురించి పట్టించుకోలేదు. కనీసం రోడ్లు వేయలేదు. డిసెంబర్ ఆఖరునాటికి భూ సేకరణ పూర్తి చేసి మార్చి 31 లోపు వరంగల్ విమానాశ్రయ పనులు ప్రారంభిస్తాం.

హైదరాబాద్ తరహాలోనే వరంగల్‌కు ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎయిర్ పోర్టు పూర్తి చేస్తాం. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన సమ్మక్క %-% సారలమ్మ మందిరం అద్భుతంగా నిర్మాణవుతోందని, అదే తరహాలో వరంగల్‌ను అభివృద్ధి చేస్తాం. తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

రాష్ట్రంలో ప్రతి మారుమూల తండాకు రోడ్డు కనెక్టివిటీ ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్రంలో ఏ గ్రామానికీ రోడ్డు లేదన్న మాట వినదలచుకోలేదని అన్నారు. రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో 20 వేల కోట్లు వెచ్చించి రోడ్లు నిర్మిస్తున్నాం. ప్రతి గూడెం నుంచి మండల కేంద్రానికి, ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండు వరుసలు, జిల్లా కేంద్రం నుంచి రాజధానికి నాలుగు వరుసల రోడ్లు వేస్తున్నాం.

రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో మహిళాభ్యున్నతి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టాం. ఉచిత బస్సు సౌకర్యం, సంఘాలకు వడ్డీ లేని రుణాలు, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఉత్పత్తుల విక్రయానికి శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్, బస్సులకు యజమానులుగా.. ఇలా అనేక పథకాలు అమలు చేస్తున్నాం.

ఇంటి ఆడబిడ్డకు చీరె పెట్టడం ఒక సంప్రదాయం. ఇంట్లో సొంత సోదరుడి తరహాలో ప్రతి ఏటా సారె పండుగ చేసుకోవాలని గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది ఆడబిడ్డలకు చీర అందిస్తున్నాం. రాష్ట్రంలో 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఆడబిడ్డకు చీరె చేరాలి.

రాష్ట్రంలో ఏ ఒక్క ఆడబిడ్డ కూడా నాకు చీర రాలేదని అనొద్దు. గ్రామీణ ప్రాంతాల్లో పూర్తయ్యాక, మార్చిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణ, మున్సిపాలిటీల్లో చీరె అందజేస్తాం.ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తోంది. రాష్ట్రంలో 1.10 కోట్ల రేషన్ కార్డులు ఉండగా, 3.10 కోట్ల మంది బిడ్డలకు సన్నబియ్యం ఇస్తున్నాం. ప్రభుత్వంపై 13 వేల కోట్ల రూపాయల భారం అవుతున్నా పేదవారి ఆకలి తీర్చాలని, వారు కడుపునిండా భోజనం చేయాలని సన్నబియ్యం ఇస్తున్నాం.

పేదవారి ఆత్మగౌరవం పెరగాలన్న లక్ష్యంతో వారికి ఇందిరమ్మ ఇండ్లు ఉండాలని, ఆర్థికంగా భారమైనప్పటికీ ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం. రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల పనులు మొదలయ్యాయి..." అని సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాలను ముఖ్యమంత్రి వివరించారు.

# 63వ జాతీయ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు







భారతదేశంలో ఉన్న హోంగార్డ్స్ మిత్రులందరికీ మీకు మీ కుటుంబ సభ్యులందరికీ అలాగే పోలీస్ డిపార్ట్మెంట్ లో ఉన్నటువంటి గౌరవ శ్రీ ఉన్నత స్థాయి పోలీస్ అధికారులందరికి 63వ జాతీయ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తు.

ఈ సందర్భంగా హైదరాబాద్ సిటీ హోంగార్డ్స్ కమాండెంట్ ఉన్నత స్థాయి అధికారుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తూ ముఖ్యఅతిథిగా గౌరవ హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ ఐపీఎస్ వి సి సజ్జనర్ సౌజన్యంతో నిర్వహించే ఉచిత వైద్య శిబిరానికి హైదరాబాద్ సిటీ హోంగార్డ్స్ వీలైన వాళ్ళందరూ ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొనాలని విజయవంతం చేయవలసిందిగా మనవి చేస్తున్న హోంగార్డ్స్ ప్రతినిధి డాక్టర్ కోత్వాల్ దయానంద్

## పాన్ మసాలా తయారీ యునిట్లపై సెస్సు బిల్లుకు లోక్ సభ ఆమోదం



న్యూఢిల్లీ డిసెంబర్ 5 పాన్ మసాలా తయారీ యునిట్లపై సెస్సు విధించడానికి సంబంధించిన బిల్లును లోక్ సభ శుక్రవారం నాడు ఆమోదించింది. ఈ సెస్సు ద్వారా సేకరించే నిధిని జాతీయ భద్రతను బలోపేతం చేయడానికి, ప్రజారోగ్యాన్ని మెరుగు పరచడానికి వినియోగిస్తారు. ఆరోగ్య భద్రత, జాతీయ భద్రతా సెస్సు బిల్లు 2025 పై జరిగిన చర్చకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సమాధానం ఇచ్చారు. ప్రజారోగ్యం రాష్ట్రం అంశం కాబట్టి సెస్సును రాష్ట్రాలతో పంచుకుంటామని అన్నారు. మూజువాణి ఓటుతో బిల్లును లోక్ సభ ఆమోదించింది. జాతీయ ప్రాముఖ్యం కలిగిన ఆరోగ్యం, జాతీయ భద్రతకు అవసరమైన ఆర్థికవనరుల కల్పనే ఈ బిల్లు ఉద్దేశ్యం అని నిర్మలా సీతారామన్ అన్నారు. పాన్ మసాలా, దాని వినియోగం పై గరిష్టంగా జిఎస్టీ కింద 40 శాతం పన్ను విధిస్తున్నారు. ఈ సెస్ విధఇంచడం వల్ల జిఎస్టీ ఆదాయం ఏమాత్రం తగ్గబోదని కేంద్రమంత్రి తెలిపారు.

## సీఎం ఆదేశిస్తే రాజీనామాకు సిద్ధం ఎమ్మెల్యే దానం



**ఖైరతాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ ఎన్నికల్లో ఫైట్ చేయడం , గెలవడం తన రక్తంలోని ఉందని దానం ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే అనర్హత వేటు అంశంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. రాజీనామా ప్రస్తావన ఇంకా రాలేదని , ముఖ్యమంత్రి ఆదేశిస్తే రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని దానం అన్నారు. తనకి ఎన్నికలు కొత్త కాదని , ఇప్పటికి 11 ఎన్నికల్లో కొట్లాడిన చరిత్ర తనకి ఉందన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం హిమాయత్ నగర్ లోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన దానం నాగేందర్ ఈ వ్యాఖ్యలు చేశారు. అనర్హత కేసు విషయంలో సుప్రీంకోర్టులో వాదనలు నడుస్తున్నాయని , తన వైపు నుండి వాదనలు వినిపిస్తానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. రైజింగ్ తెలంగాణ కోసం తలపెట్టిన గ్లోబల్ సమ్మిట్ ను రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా నిర్వహిస్తుందని దానం అన్నారు.

# మంత్రి పొంగులేటి స్వగ్రామంలో ఏకగ్రీవం

- పార్టీలకతీత నిర్ణయం.... కాంగ్రెస్ అభ్యర్థికే సర్వసమ్మతి
- నారాయణపురం సర్పంచ్‌గా గొల్లమందల వెంకటేశ్వర్లు ఖరారు
- మంత్రి సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి సమన్వయంతో ఏకాభిప్రాయం



కల్లూరు : తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్వగ్రామం కల్లూరు మండలం నారాయణపురం పంచాయతీలో సర్పంచ్ పదవి ఏకగ్రీవంగా ఖరారైంది. మండల పరిధిలో మూడో విడతలో జరగాల్సిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గొల్లమందల వెంకటేశ్వర్లు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో పోటీ లేకుండానే ఫలితం తేలిపోయింది.

- గ్రామ అభివృద్ధి కోసం ఏక కంఠం

ఎస్సీ జనరల్‌కు రిజర్వ్ చేసిన ఈ స్థానానికి గ్రామాభివృద్ధి ప్రధాన ధ్యేయంగా గ్రామ పెద్దలు, యువకులు, అన్ని వర్గాల ప్రజలు ఒకే అభిప్రాయంతో ముందుకొచ్చారు. రాజకీయాలను పక్కనబెట్టి కాంగ్రెస్ అభ్యర్థికి సర్వసభ్య మద్దతు ప్రకటించారు.

- మంత్రి సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి సమన్వయంతో ఏకాభిప్రాయం

ఈ ఏకగ్రీవానికి మంత్రి సోదరుడు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. గ్రామంలోని అన్ని వర్గాల నాయకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి అభిప్రాయ భేదాలను సర్దుబాటు చేసి ఏకాభిప్రాయాన్ని ఏర్పరిచారు. దీంతో పంచాయతీ పాలకవర్గం మొత్తం ఏకగ్రీవంగా ఏర్పడే దిశగా మార్గం సుగమమైంది.

- మంత్రి పొంగులేటి అభినందనలు... ప్రజల్లో హర్షం

ఏకగ్రీవంగా ఎన్నికైన వెంకటేశ్వర్లుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రసాద్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నారాయణపురం అభివృద్ధి పథంలో ఇది శుభ సూచికమని మంత్రి వ్యాఖ్యానించారు. స్వగ్రామం ఏకగ్రీవం కావడంతో స్థానిక ప్రజలు, కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వెల్లివిరుస్తోంది.





శ్రీ వేణుగోపాల గురు స్వామి పాదయాత్ర బృందం2025.
శ్రీ పవన్ నాయుడు గురు స్వామి ఆధ్వర్యంలో అక్టోబర్ 26 తేదీ బషీర్‌బ్యాగ్ అమ్మ వారి ఆలయం నుండి శబరి మాల పాదయాత్ర పూర్తిచేసుకోని హైదరాబాద్ చేరుకోన నౌబాత్ పహాడ్ (బిర్లా మందిర్)బస్తీ అధ్యక్షుడు కొర్రి రాధా కృష్ణ
ఈ సంధర్బంగా కుటుంబ సభ్యులు,బస్తీ నివాసులు మరియు స్వాములు పలుకరును స్వాగతించారు.
బి.విజయేందర్,ఎన్.కిరణ్,కె.బీంసాయి,సాయికుమార్,డి.ప్రశాత్,



## గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ను ప్రత్యేకంగా ఆహ్వానించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.



హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో ఈనెల 8, 9 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని జారండ్ సీఎం హేమంత్ సోరెన్ ను ప్రత్యేకంగా ఆహ్వానించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.

జారండ్ సీఎం నివాసంలో జరిగిన ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్రించిన గ్లోబల్? సమ్మిట్? ఆహ్వాన పత్రికను సీఎం శ్రీ హేమంత్ సోరెన్ కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అందజేశారు.

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతుందని డిప్యూటీ సీఎం వివరించారు.

దీనికి అనుగుణంగా అన్ని రంగాల వృద్ధి లక్ష్యాలు, అనుసరించే భవిష్యత్తు ప్రణాళికలను విశ్లేషించేలా తెలంగాణ రైజింగ్? 2047 విజన్? డాక్యుమెంట్? ను రూపొందించినట్లు ఈ భేటీ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు.

నీతి అయోగ్ సలహాలు సూచనలతో పాటు అన్ని రంగాల నిపుణుల మేథో మథనంతో తయారు చేసిన ఈ విజన్? డాక్యుమెంట్? ను గ్లోబల్? సమ్మిట్? లో ఆవిష్కరించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు జార?ండ్ సీఎం కు వివరించారు.






భారత్ ఫ్యూచర్ సిటీ – హైదరాబాద్ లో ఈ నెల 8,9 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్" కు హాజరు కావాలని తమిళనాడు సీఎంఎం.కే. స్టాలిన్ ని ప్రత్యేకంగా ఆహ్వానించిన నీటిపారుదల & పౌర సరఫరాల శాఖల మంత్రివర్యులు శ్రీ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

# కేటీఆర్ ది విషపూరితమైన ఆలోచన

### ఎల్బి నగర్లో సిరీస్ ఫ్యాక్టరీ భూములను రెసిడెన్షియల్ జోన్‌గా మార్చింది కేటీఆర్ కాదా?

### అయ్య ముఖ్యమంత్రిగా, కొడుకు మంత్రిగా వేల ఎకరాలు ధారాదత్తం చేశారు.

### హిల్ట్ పాలసీపై కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి కౌంటర్



హైదరాబాద్ :- హిల్ట్ పాలసీపై బి.ఆర్. ఎస్ విమర్శలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తిప్పికొట్టారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో హిల్ట్ పాలసీపై బిఆర్ఎస్ ఆరోపణలపై విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి పొంగులేటి సమాధానమిచ్చారు.

హిల్ట్ పాలసీలో రెండు అంశాలు బిఆర్ఎస్ పాలనలో వచ్చినవే, ఆ ఫైల్‌పై మంత్రిగా కేటీఆర్ సంతకం చేసిన సంగతి మరిచారా?గత ప్రభుత్వంలో కోకాపేట, నియోపోలిస్ ప్లాట్లు వేలం వేశారు, హిల్ట్‌ను దోపిడీ పాలసీ అంటున్న కేటీఆర్‌కు ఇవి గుర్తులేవా?ఓఆర్ ఆర్ నిర్వహణను కూడా వేలం వేశారు. అయ్య ముఖ్యమంత్రిగా కొడుకు పరిశ్రమల శాఖ మంత్రిగా కావలసిన వారి దగ్గర ముడుపులు తీసుకొని భూములను కన్వర్షన్ చేశారు. ప్రభుత్వ భూములు వేలం వేశారు. పరోక్షంగా, ప్రత్యక్షంగా వేలాది ఎకరాలు వేలం వేశారు.ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌బి నగర్‌లోని దాదాపు 40 ఎకరాల స్థలాన్ని పివి రాజు ఫార్మా కంపెనీకి లీజుకు ఇవ్వడం జరిగింది. అక్కడ కెమికల్ ఫ్యాక్టరీ తోటి భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని అక్కడి ప్రజలు ఆందోళన కూడా చేశారు. ఈ కెమికల్ ఇండస్ట్రీని రెసిడెన్షియల్ జోన్‌గా మార్చింది బిఆర్ఎస్ కాదా? ఈ ఫైలుపై అయ్య కొడుకులు సంతకాలు చేయలేదా? ఏ పాలసీతో ఈ కన్వర్షన్ చేశారు. ఐడిపిఎల్ లో కూడా ఇదే విధంగా చేశారు. కేటీఆర్ కడుపునిండా విషమేఉంది. విషం కక్కడానికి కూడా ఒక హద్దు, అదుపు, పద్ధతి ఉంటుంది. కేటీఆర్ ది కడుపుమంట. విషపూరితమైన ఆలోచన.

## బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి చేసిన దారుణమైన మోసం

## శ్రీసాయి ఈశ్వర్ అనే యువకుడి నిండు ప్రాణం బలైందని కేటీఆర్ ఆవేదన



హైదరాబాద్ డిసెంబర్ 5 బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్ రెడ్డి చేసిన దారుణమైన మోసానికి శ్రీసాయి ఈశ్వర్ అనే యువకుడి నిండు ప్రాణం బలైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీకి కాంగ్రెస్ సర్కారు తూట్లు పొడవడాన్ని తట్టుకోలేకే ఈశ్వర్ ఆత్మాహుతి చేసుకున్నాడని తెలిపారు.పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కేవలం 17 శాతానికే కుదించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచారని కేటీఆర్ మండిపడ్డారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యేనని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా సాయి ఈశ్వర్ మరణానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.కులగణనను మొదలుకుని న్యాయస్థానాల్లో నిలబడని జీవోల దాకా కాంగ్రెస్ ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా కామారెడ్డి డిక్లరేషన్ కు సమాధి కట్టిందని కేటీఆర్ అన్నారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం 50 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని డిఆమండ్ చేశారు.

# మాజీ మంత్రులకు చెక్...



విజయవాడ, డిసెంబర్ 5, వైయస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ పూర్తి ఫోకస్ పెట్టారు. అయితే ఆయన ఇప్పుడు కొందరు మాజీ మంత్రుల విషయంలో కఠినంగా ఉన్నారు. పాత స్థానాలు ఇచ్చే అవకాశం లేదని.. తాను సూచించిన చోటకు వెళ్లాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. అయితే ఇదివరకు పరిస్థితి ఉంటే అధినేత చెప్పిన మరుక్షణం వెళ్లేవారు. కానీ ఆయన మాజీ ముఖ్యమంత్రి అయ్యారు. ఆపై క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తాము వెళ్లలేమని మాజీ మంత్రులు మొండికేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికలకు ముందు ఇలానే చెప్పి పంపించారని.. ఇప్పుడు కూడా మాపై ప్రయోగాలు ఏంటి అని మాజీ మంత్రులు అధినేతను ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే పార్టీలో కొనసాగలేమని చెబుతున్నారు. అయితే ఈ పరిస్థితి ఎదుర్కొంటున్న మాజీ మంత్రులు కూటమి పార్టీల్లో చేరలేరు. ఎందుకంటే వీరంతా అధినేత జగన్మోహన్ రెడ్డికి వీర విధేయులు. ప్రత్యర్థులపై చెలరేగిపోయేవారు. అందుకే వీరిని తీసుకునేందుకు ఏ పార్టీ కూడా ముందుకు రావడం లేదు. వైసీపీలో ఉండలేక వీరంతా రాజకీయ సన్యాసం చేసుకునేందుకు సిద్ధపడుతున్నారని తెలుస్తోంది.నెల్లూరు అంటే గతంలో గుర్తుకొచ్చే పేరు అనిల్ కుమార్ యాదవ్. అటువంటి అనిల్ ఇప్పుడు నెల్లూరు జిల్లాలో అనామకుడు. కనీసం పరిగణలో కూడా లేరు. రెండుసార్లు నెల్లూరు సిటీ నుంచి గెలిచిన ఆయన మొన్నటి ఎన్నికల్లో నరసాపురం ఎంపీ స్థానానికి పోటీ చేసి దారుణంగా ఓడిపోయారు. ఆయన ఇప్పుడు తిరిగి నెల్లూరు సిటీని కోరుకుంటున్నారు. జగన్మోహన్ రెడ్డి మాత్రం రకరకాల పేర్లు చెప్పి అక్కడకు వెళ్లాలని సూచిస్తున్నారు. అటు ప్రకాశం, ఇటు గుంటూరులో సీట్లు ఇస్తామని చెబుతుండడంతో చాలా ఆవేదనతో ఉన్నారు అనిల్ కుమార్ యాదవ్. నెల్లూరు సిటీ ఇస్తే రాజకీయాలు చేస్తా.. లేకుంటే మానుకుంటా అన్నట్టు ఉన్నారు పక్క రాష్ట్రంలో వ్యాపారాలు చేసుకుని అప్పుడప్పుడు వచ్చి రాజకీయ విమర్శలు చేసి వెళ్లిపోతున్నారు.మరో మాజీ మంత్రి విడదల రజిని పరిస్థితి కూడా అలానే ఉంది. 2019 ఎన్నికలకు ముందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి చిలకలూరిపేట టికెట్ కొట్టేశారు. ఎమ్మెల్యే అయిపోయారు కూడా. తరువాత మంత్రి అయ్యారు. ఒక సిట్టింగ్ మంత్రిగా ఉంటూ ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటున్నారని చెప్పి జగన్ ఆమెను గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి పంపించారు. అయితే అక్కడ ఆమె దారుణంగా ఓడిపోయారు. తిరిగి చిలకలూరిపేట వచ్చి రాజకీయాలు చేసుకుంటున్నారు. కానీ ఆమెను ఇప్పుడు రేపల్లె వెళ్ళమంటున్నారు జగన్మోహన్ రెడ్డి. ఉంటే చిలకలూరిపేటలో రాజకీయం చేస్తాను తప్ప తాను రేపల్లె వెళ్లను అని తేల్చేస్తున్నారు రజని. ఆమె కూడా కూటమి పార్టీలో చేరలేక రాజకీయ సన్యాసమే శరణ్యం అని భావిస్తున్నారు. అయితే ఒక్క ఇద్దరు మాజీ మంత్రులే కాదు. అంబటి రాంబాబు, గుడివాడ అమర్నాథ్, జోగి రమేష్ లాంటి వారు సైతం ఇష్టం లేని నియోజకవర్గాల్లోనే కొనసాగుతున్నారు. అయితే ఇక్కడ ఒకటి గమనించుకోవాలి. ఈ నేతలంతా జగన్మోహన్ రెడ్డికి అత్యంత విధేయులే. విధేయత చూపిన వారికి నచ్చిన పని చేయాలే కానీ.. ఇలా తమపై ప్రయోగం చేయడం ఏంటనేది వీరి వాదన

# సీతారాం... రాం...రాం...

శ్రీకాకుళం, డిసెంబర్ 5, ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రస్తుతం సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయినట్లుంది. అప్పడప్పుడు కనిపిస్తున్నారు. కనీసం తన నియోజకవర్గమైన ఆముదాల వలసలో జరుగుతున్న పరిణామాలపై కూడా తమ్మినేని సీతారాం స్పందించకపోతుండటంపై వైసీపీ హైకమాండ్ అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. సీనియర్ నేతగా ఆయన రాష్ట్ర వ్యాప్త సమస్యలపై ఉద్యమించాల్సిన తరుణంలో కనీసం ఆముదాల వలస పరిణామాలపై కూడా స్పందించకపోవడం పై వైసీపీ నాయకత్వం సీరియస్ గా ఉంది. గతంలో ఐదేళ్ల పాటు స్పీకర్ గా ఉన్న తమ్మినేని సీతారం మొన్నటి ఎన్నికలలో ఓటమి పాలయిన ఉత్తరాంధ్రలో కీలకనేత



తమ్మినేని సీతారాం సైలెంట్ గా మారడం సహించలేకపోతున్నారు.తమ్మినేని సీతారాం గత కొద్ది రోజుల నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తమ్మినేని సీతారాం రాజకీయ ప్రస్థానం తెలుగుదేశం పార్టీ నుంచి ప్రారంభమయింది. తర్వాత ఆయన 2008లో ప్రజారాజ్యం పార్టీలో చేరారు. 2009 ఎన్నికలలో పోటీ చేసి ఓటమి పాలయిన అనంతరం తిరిగి ఆయన తెలుగుదేశం పార్టీలో చేరారు.అయితే వైసీపీ ఆవిర్భావం తర్వాత తమ్మినేని సీతారాం వైసీపీలో చేరారు. 2014లో ఆముదాల వలస నుంచి పోటీ చేసినా ఓటమి పాలయ్యారు. 2019 ఎన్నికలలో గెలిచి వైసీపీ అధికారంలోకి రావడంతో స్పీకర్ గా పనిచేశారు. ఐదేళ్ల పాటు ఆయన ఏపీకి స్పీకర్ గా బాధ్యతలను నిర్వర్తించారు.రాజకీయాల్లో ఓటములు సహజం. ఓడిపోయినంత మాత్రాన పార్టీని వదిలేసుకుంటే ఎలా? అన్న ప్రశ్న క్యాడర్ నుంచి వస్తుంది.తమ్మినేని సీతారాంను ఆముదాలవలస ఇన్ ఛార్జి పదవి నుంచి తప్పించి శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గ ఇన్ ఛార్జిగా జగన్ నియమించారు. 1999 నుంచి టీడీపీ నుంచి ఆముదాలవలస లో గెలిచిన తమ్మినేని సీతారాంకు తర్వాత ఎమ్మెల్యే కావాడానికి పదేళ్ల సమయం పట్టింది. వైసీపీ నుంచి మూడు సార్లు టిక్కెట్ పొంది ఒక్కసారి మాత్రమే గెలిచారు. తమ్మినేని సీతారాం తన సమీప బంధువు టీడీపీ ఎమ్మెల్యే కూనరవికుమార్ పై కనీసం విమర్శలు చేయడానికి కూడా ఎందుకు వెనకడుగు వేస్తున్నారన్న అనుమానాలు అందరిలోనూ కలుగుతున్నాయి. అలాగని వైసీపీని వీడి వేరే పార్టీలో చేరే అవకాశం కూడా లేదు. ఎందుకంటే తమ్మినేని సీతారాంకు ఏ పార్టీ గేట్లు ఓపెన్ కావు. ఆ విషయం తెలిసి కూడా ఎన్నికలకు ముందు బయటకు వచ్చి చెలరేగిపోవాలని ఆయన చూస్తున్నాడేమోనన్న సెటైర్లు వినిపిస్తున్నాయి.

# పవన్ ఫ్యూచర్ ప్లాన్స్...

కాకినాడ, డిసెంబర్ 5, కూటమిలో ఆయనే కీలకం. ముగ్గురు మంత్రులు, 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు. ఇప్పుడు ఆయన బలం ఇదే. రాబోయే రోజుల్లో రాజకీయంగా ఇంకా బలపడాలనుకుంటున్న సేనాని..తన సైన్యం బలాన్ని మరింత పెంచుకునే పనిలో పడ్డారు. అందుకోసం ఏకంగా ఫైవ్ పాయింట్ ఫార్ములా రెడీ చేశారట. గల్లీ టు ఢిల్లీ..లోకల్ టు లోక్‌సభ వరకు..పార్టీకి ఓ స్ట్రక్చర్ ఉండేలా కమిటీల ఏర్పాటుకు రెడీ అయ్యారట.అధికారంలో ఉన్నామని రిలాక్స్ అవడం లేదు. తాను పని చేస్తున్నారు. పార్టీని బలోపేతం చేయాలని కలలు కంటున్నారు. పది కాలాల పాటు జనసేన పార్టీ ఉండేలా.. స్పెషల్ మాస్టర్ ప్లాన్ రెడీ చేస్తున్నారట ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్. పార్టీకి బలమైన పునాదులు వేసే దిశగా..గ్రామ స్థాయి నుంచి లోక్‌సభ ఎంపీ వరకు..అన్ని స్థాయిల్లో బలమైన కమిటీల ఏర్పాటుకు మిషన్ స్టార్ట్ చేయబోతున్నారట.కూటమిగా పవర్‌లోకి వచ్చి 15 నెలలు అయిపోతున్న టైమ్‌లో ఫ్యూచర్ పాలిటిక్స్‌పై ఫోకస్ పెట్టారు. తనతో సహా గెలిచిన 21 మంది ఎమ్మెల్యే సీట్లను, రెండు పార్లమెంట్ స్థానాలను తిరిగి నిలబెట్టుకోవడంతో పాటు..రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో క్యాడర్, లీడర్ల బలోపేతం కోసం స్పెషల్ యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తున్నారట. గ్రామ, మండల, నియోజకవర్గాల వారీగా ఐదుగురు సభ్యులతో కూడిన ఫైవ్ మెన్ కమిటీలు వేసేందుకు సిద్ధమవుతున్నారట పవన్. ఈ కమిటీ ఇటు జనసేన పార్టీ కోసం పని చేయడంతో పాటు..అటు అభివృద్ధి కోసం తమవంతు ప్రయత్నం చేసేలా రూపకల్పన చేస్తున్నారట.జనసేన క్యాడర్, లీడర్లు..పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. అభివృద్ధిలో, మౌలిక వసతుల ఏర్పాటులో క్రియాశీలకంగా పనిచేసేలా క్యాడర్, లీడర్లను మోటివేట్ చేస్తూ వస్తున్నారు పవన్. అందులో భాగంగా ఐదుగురు సభ్యుల కమిటీని తెరమీదకు తెచ్చారట. గ్రామ, మండల, శాసనసభ, లోక్‌సభ నియోజకవర్గాల స్థాయిల్లో ఐదుగురు సభ్యులతో కమిటీలు వేస్తామంటున్నారు. ఈ కమిటీ పార్టీ కార్యక్రమాల నిర్వహణతో పాటు అభివృద్ధి పనుల్లోనూ పాల్గొనేలా చేయాలని భావిస్తున్నారు. ప్రతి కమిటీలోనూ మహిళల ప్రాతినిధ్యం తప్పనిసరి అని, ఒకరు లేదా ఇద్దరు వీర మహిళలకు చోటు కల్పించాలని అనుకుంటున్నారుపిఠాపురం నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా ఐదుగురు సభ్యులతో కమిటీ వేయగా..ఆ కమిటీ పనితీరును పరిశీలించాక..మిగతా అన్ని ప్రాంతాల్లో కమిటీలు వేయాలని పవన్ డిసైడ్ అయ్యారట. సేమ్‌టైమ్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, వివాదాల పరిష్కరానికి కూడా..కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ వింగ్‌ను కూడా ఏర్పాటు చేయబోతున్నారట.పైలెట్ ప్రాజెక్టుగా మొదట ఐదుగురు సభ్యుల కమిటీని పిఠాపురం నుంచి ప్రారంభించారు. పిఠాపురంలో ఆరు నెలల పాటు పరిస్థితులను గమనించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధంగా పార్టీని బలోపేతం చేసేందుకు నేతలకు ప్రత్యేక బాధ్యతలను అప్పచెప్పినట్లు సమాచారం. పిఠాపురం మోడల్‌ను త్వరలో మిగతా నియోజకవర్గాల్లో కూడా అమలు చేయబోతున్నారట. ఫ్యూచర్ బేస్డ్ పొలిటికల్ ప్లాన్స్‌లో భాగంగా పార్టీ స్ట్రక్చర్‌పై పవన్ పెడుతున్న ఫోకస్ ఇంట్రెస్టింగ్‌గా మారింది. పిఠాపురం ఎమ్మెల్యేగా ఉన్న ఆయన..తన సీటును పదిలం చేసుకునేందుకు పార్టీకి బలమైన పునాదులు వేసేలా ప్లాన్ స్టార్ట్ చేశారటగోదావరి జిల్లాలను తన రాజకీయ క్షేత్రానికి కేంద్రంగా మార్చుకునేలా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడున్న బలం చెక్కుచెదరకుండా ఉండాలంటే..భవిష్యత్‌లో పార్టీ ఇంకా బలపడి ఎదగాలంటే..ప్రజలకు మరింత దగ్గర కావాలన్నది పవన్ వ్యూహమంటున్నారు. అందుకే ఫైవ్ మెన్ కమిటీలను ఏర్పాటు చేసే ఆలోచనకు శ్రీకారం చుట్టారట. పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దేందుకు మాస్టర్ స్కెచ్ రెడీ చేస్తున్నారట పవన్. పంచసూత్ర ద్వారా పవన్ పార్టీని ఎలా బలోపేతం చేస్తారో..ఆ కమిటీలు పార్టీ యాక్టివిటీని, డెవలప్‌మెంట్‌ను ఎలా బ్యాలెన్స్ చేస్తాయో చూడాలి

# ల్యాండ్ బ్యాంక్ కు ఎండ్ ఎప్పుడు

విజయవాడ, డిసెంబర్ 5, చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకలా, రాకపోతే మరోలా ఉంటారన్నది అందరూ చెప్పే మాట. ప్రస్తుతం రాజధాని అమరావతి విషయంలో చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న నిర్ణయాల వెనక అదృశ్య శక్తి ఏదో ఉందని అంటున్నారు. చంద్రబాబు నాయుడు ఇప్పటి నుంచి కాదు.. సహజంగానే 1995 నుంచి ఆయన ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యతిరేకం. ప్రయివేటు సంస్థలతోనే వేగంగా అభివృద్ధి సాధ్యమవుతుందని నమ్ముతారు. అందుకే ఆయన అధికారంలోకి రాగానే నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అనేక ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేశారన్నది మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు లాంటి వారు చెబుతున్న మాట. అందులో కొంత నిజమున్నా.. చంద్రబాబు ఆలోచనలు కూడా ఒకరకంగా కరెక్టేనని అనేవారు కూడా అనేక మంది ఉన్నారు.

ప్రభుత్వ రంగంలో ఉండేవారు కష్టించి పనిచేయరని, అదే ప్రయివేటు రంగంలో అయితే ఎక్కువ కష్టపడటమే కాకుండా సంపద సృష్టిలో వారు వేగంగా స్పందిస్తారని భావిస్తారు. అందులో ఏ మాత్రం తప్పులేదు. అయితే రాజధాని అమరావతి విషయంలోనూ చంద్రబాబు దూర దృష్టితోనే భూములను తీసుకుంటున్నారంటున్నారు. ఎందుకంటే.. తొలినాళ్లలో భూములు తీసుకోకపోతే రాజధాని అమరావతి అభివృద్ధి చెందిన తర్వాత అక్కడ భూముల ధరలకు రెక్కలు వస్తాయి. అప్పుడు రైతులు కూడా ఇచ్చేందుకు అంగీకరించరు. అందుకే ముందుగానే అవసరానికి మించి ఎక్కువ కొనుగోలు చేసి ప్రభుత్వం వద్ద ఉంచుకుంటే అది అభివృద్ధికి దోహదపడుతుందని భావిస్తున్నారు. తన ఆలోచన పవన్ కల్యాణ్ ముందు ఉంచబట్టే ఆయన కూడా ఈ ప్రతిపాదనకు అంగీకరించారంటున్నారు.అందులో భాగంగానే తొలి దశలో 34 వేల ఎకరాలు రైతుల నుంచి సేకరించినా.. రెండో దశలో 16,666 ఎకరాలు తీసుకుంటున్నా.. మూడు.. నాలుగు ఇలా అనేక దశల్లో భూసేకరణ ఉంటుందన్నది ప్రభుత్వ వర్గాల అంచనా. రాజధాని అమరావతిలో నిర్మాణాలు పూర్తి కావడానికి ఇంకా మూడేళ్ల సమయం ఉంది. ఈ మేడేళ్లలో ఇంకొన్ని వేల ఎకరాలను సేకరించి ప్రభుత్వం వద్ద ఉంచుకుంటే భవిష్యత్ ల్యాండ్ బ్యాంక్ గా ఉపయోగపడుతుందని చంద్రబాబు అంచనా వేస్తున్నట్లు అధికారులే చెబుతున్నారు. అయితే అభివృద్ధి ఎక్కడ? అని ప్రశ్నిస్తున్న వారికి ఇప్పుడు సమాధానం చెప్పాల్సిన పనిలేదని, తన పని తాను చేసుకుపోయే పనిలోనే చంద్రబాబు ఉన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే భూసమీకరణ అని చెబుతున్నారు. మొత్తం మీద చంద్రబాబు ఆలోచన కరెక్టే అయినా వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రజాప్రతినిధులు విఫమయ్యారనే వారు కూడా ఉన్నారు.

# పార్లమెంట్ ముందుకు అమరావతి బిల్లు

విజయవాడ, డిసెంబర్ 5, ధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం, 2014లోని 5(2) సెక్షన్‌ను సవరించే ప్రతిపాదనకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఈ సవరణ బిల్లును కేంద్ర కేబినెట్ ఆమోదం తర్వాత పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. పార్లమెంట్ ఆమోదం అనంతరం అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఈ ప్రక్రియ రెండు వారాల్లో పూర్తి కావచ్చని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 5(2) సెక్షన్ ప్రకారం, హైదరాబాద్‌ను 10 సంవత్సరాలు రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా పేర్కొన్నారు. అయితే, విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని పేరు ఎక్కడా పేర్కొనలేదు, కేవలం “రెసిడ్యువరీ ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్” అని మాత్రమే పేర్కొన్నారు. ఈ లోపం వల్ల రాజధాని విషయంలో చట్టపరమైన అస్పష్టత ఏర్పడింది. 2015లో టీడీపీ ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ప్రకటించినా, గెజిట్ నోటిఫికేషన్ జారీ కాలేదు. అసెంబ్లీలో అమరావతిని ప్రతిపక్ష నేతగా జగన్ కూడా ఆమోదించడంతో ఇక రాజధాని సమస్య ఉండదనుకున్నారు.కానీ 2019-2024 మధ్య జగన్ సీఎం అయ్యాక మూడు రాజధానుల విధానం తెరపైకి తెచ్చారు. అమరావతి ప్రాజెక్టును నిలిపివేశారు.

దీనికి వ్యతిరేకంగా అమరావతి రైతులు తీవ్ర పోరాటం చేశారు. న్యాయపరంగా కూడా జగన్ ప్రయత్నాలు సాధ్యం కాలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించడంతో, చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరింది. మే 8, 2025న ఏపీ కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అమరావతిని రాజధానిగా చట్టంలో చేర్చాలి అనే ప్రతిపాదన ఆమోదించారు. ఈ ప్రతిపాదనను కేంద్రానికి పంపారు. తాజా సమాచారం ప్రకారం, కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఈ సవరణకు ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు ప్రక్రియ వేగవంతం చేస్తున్నారు.కేబినెట్ సమావేశంలో ఆమోదం తర్వాత, సవరణ బిల్లును వింటర్ సెషన్‌లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. బిల్లు రెండు సభల్లో ఆమోదం పొందిన తర్వాత, అమరావతిని రాజధానిగా ప్రకటిస్తూ గెజిట్ విడుదల చేస్తారు. ఈ ప్రక్రియ రెండు వారాల్లో పూర్తి కావచ్చని అంచనా. అమరావతిలో రెండో విడత భూసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో అమరావతికి గెజిట్ వస్తే రైతులు మరింత ధైర్యంగా భూములు ఇచ్చే అవకాశం ఉంది.

వైసీపీ స్టాండ్ ఏంటీ

రాష్ట్ర విభజన చట్టంలోని పదేళ్లకు మించకుండా ఏపీ, తెలంగాణకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ కొనసాగింది. ఆ గడువు ముగియడంతో తెలంగాణ రాజధానిగా హైదరాబాద్ కొనసాగుతోంది. ఇప్పుడు విభజన చట్టాన్ని సవరిస్తే ఏపీకి కొత్త రాజధాని ఏర్పాటవుతుంది. అప్పుడు అమరావతి అన్‌స్టాపబుల్ అన్న ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. ఇక పార్లమెంట్‌లో ఎలాగూ ఎన్డీయే పక్షాలకే బలం ఉండటంతో విభజన బిల్లు పాస్ అవడం ఈజీ కానుంది.అయితే అమరావతి బిల్లు పార్లమెంట్‌కు వచ్చినప్పుడు వైసీపీ సభ్యులు మద్దతిస్తారా లేదా అన్నది కూడా ప్రజల్లో చర్చ పెట్టాలని చూస్తోందట కూటమి. భవిష్యత్‌లో మళ్లీ రాజధాని మార్పుపై ఎలాంటి నిర్ణయాలు జరగకుండా ఉండాలనే ఉద్దేశంతోనే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి చట్ట సవరణకు శ్రీకారం చుట్టింది.విభజన చట్టంలోని సవరణ ముసాయిదాకు కేంద్ర న్యాయశాఖ ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ముసాయిదాను ప్రధాని ఆధ్వర్యంలోని కేంద్ర క్యాబినెట్ ఆమోదించాల్సి ఉంది. కేంద్ర మంత్రివర్గం ఆమోదం తర్వాత, పార్లమెంట్ ఉభయ సభల్లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేస్తారు. పార్లమెంట్‌లో ఆమోదం పొందిన తర్వాత, రాష్ట్రపతి సంతకంతో అమరావతిని ఏపీ రాజధానిగా ప్రకటిస్తూ అధికారికంగా గెజిట్ రిలీజ్ కానుంది.అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే..ప్రజల్లో ఉన్న అయోమయానికి చెక్ పెట్టడంతో పాటు ఇన్వెస్టర్లలో నమ్మకం కలగనుంది.

డిసెంబర్‌లో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో అమరావతి బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఇదే జరిగితే అమరావతికి రాజముద్ర వేస్తూ..కొత్త ఏడాదిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

# ఐ ప్యాక్... ప్యాచప్...

విజయవాడ, డిసెంబర్ 5, బీహార్ ఫలితం దేశంలో చాలా రాజకీయ పార్టీలకు ఒక సంకేతాలు ఇచ్చినట్లు అయింది. అక్కడ బిజెపి, జెడియు గెలుపు.. ఆర్జెడి, కాంగ్రెస్ ఓటమిని పక్కన పెడితే.. ప్రశాంత్ కిషోర్ ఓడిపోయిన తీరుతోనే దేశం యావత్తు ఆసక్తిగా చూసింది. ఈ ప్రశాంత్ కిషోర్ యేనా ఇప్పటివరకు రాజకీయ పార్టీలను గెలిపించింది? అంటూ విశ్లేషించే దాకా పరిస్థితి వచ్చింది. అయితే రాజకీయ వ్యూహకర్తలంటే కొంచెం సాంకేతికతను జోడించి.. రాజకీయ వ్యూహాలు చేయడమా అనే ప్రశ్న ఎదురవుతోంది. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రశాంత్ కిషోర్ ప్రవేశంతోనే రాజకీయ వ్యూహకర్తల శకం ప్రారంభం అయింది. ఇప్పుడు ఆయన ఓటమితోనే అదే రాజకీయ వ్యూహకర్తల ముగింపు మొదలవుతుందని అంచనాలు ఉన్నాయి. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఏపీలో రుషిరాజ్ సింగ్ నేతృత్వంలోని ఐపాక్ టీం సేవలకు స్వస్తి పలకనున్నట్లు సమాచారం. గతంలో ప్రశాంత్ కిషోర్ ఐప్యాక్ టీంకు సారథ్యం వహించగా.. ఆయన బీహార్ ఎన్నికల వైపు వెళ్లడంతో ఆ బాధ్యతలను రుషిరాజ్ సింగ్ చూసుకున్నారు. కానీ ఇప్పుడు ప్రశాంత్ కిషోర్ ఓటమితో వ్యూహకర్తలకు వందల కోట్ల రూపాయలు అనవసరంగా పోశామన్న బెంగ వైసీపీ నాయకత్వంలో ఉన్నట్లు తెలుస్తోంది.2017లో జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేసే సమయంలో ప్రశాంత్ కిషోర్ వైసిపి వ్యూహకర్తగా నియమింపబడ్డారు. అప్పట్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి విపరీతమైన ఆదరణ ఉండేది. ప్రజల్లో విపరీతమైన సానుభూతి కూడా ఉండేది. ఆ పై ఒక్కసారి ఓడిపోయారన్న సానుభూతి కూడా ప్రజల్లో మిక్కిలిగా ఉండేది. ఆ సమయంలో పాదయాత్ర చేస్తే జనాదరణ విపరీతంగా వచ్చింది. దానికి ప్రశాంత్ కిషోర్ టీం పబ్లిసిటీ తోడైంది. అది మొదలు ప్రశాంత్ కిషోర్ వ్యూహాలు బాగానే పనిచేసాయి. ఆయన సొంత రాష్ట్రం లో రాజకీయాలు చేసేందుకు వ్యూహకర్త పదవి నుంచి తప్పుకున్నారు.రుషిరాజ్ సింగ్ కు ఆ బాధ్యతలు కట్టబెట్టారు. అయితే ఐదేళ్లపాటు వైసీపీ కోసం పనిచేసిన ఐపాక్ టీం పట్ల పూర్తి నమ్మకం పెట్టుకున్నారు జగన్. వారిచ్చిన నివేదికలనే నమ్ముకున్నారు. పార్టీ నేతలు వద్దని వారించినా వినలేదు. అయితే ఇప్పుడు ప్రశాంత్ కిషోర్ అనే వ్యూహకర్త ఓడిపోవడంతో జగన్మోహన్ రెడ్డికి తత్వం బోధపడిందట.అయితే ప్రశాంత్ కిషోర్ లేకపోవడం వల్లే జగన్మోహన్ రెడ్డికి మొన్నటి ఎన్నికల్లో ఓటమి అని అంతా భావించారు. దీనికి తోడు ప్రత్యేక హెలికాప్టర్లో చంద్రబాబు ఇంటికి వచ్చి విందు కూడా చేశారు. ఆయన ఇచ్చిన సలహాలతోనే ముందుకెళ్లడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది అని టిడిపి శ్రేణులు అంచ నాకు వచ్చాయి. అయితే బీహార్లో ఆయన ఓడిపోవడంతో ఇప్పుడు తెలుగు రాజకీయ పార్టీల్లో ఒక రకమైన చేంజ్ కనిపిస్తోంది. పార్టీలకు ప్రజాభిమానం ఉంటే గెలుపు.. ప్రజా వ్యతిరేకత ఉంటే ఓటమి ఖాయమని.. అనవసరంగా వ్యూహకర్తల చేతుల్లో వందల కోట్లు పెట్టి చేతులు కాల్చుకోవడం అనేది మంచి పద్ధతి కాదని నేతలు అభిప్రాయపడుతున్నారు. మొన్నటి ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ప్రశాంత్ కిషోర్ ను తెచ్చుకున్న.. తెలుగుదేశం పార్టీకి పీకే సలహాలు లేకపోయినా ఫలితం అలానే వచ్చేదట. ఎంతటి ప్రశాంత్ కిషోర్ అయినా ప్రజల మనసును మార్చలేరు కదా. కేవలం వ్యూహకర్త అంటే ఏవేవో లెక్కలు చెప్పడమే తప్పించి మరొకటి కాదన్న అభిప్రాయం కూడా ఉంది.

# అమెరికా నుంచి 3,258 మంది

న్యూఢిల్లీ, డిసెంబర్ 5, (న్యూస్ పల్స్) ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ మంది భారతీయులను అమెరికా (యూఎస్) బహిష్కరించినట్లు కేంద్రం పార్లమెంట్ లో వెల్లడించింది. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. 2009 నుంచి ఇప్పటి వరకూ 18,822 మంది భారతీయుల్ని అమెరికా బహిష్కరించిందన్నారు. 2023లో 617 మందిని, 2024లో 1,368 మందిని, 2025లో 3,258 మంది భారతీయులను అమెరికా బహిష్కరించినట్లు వివరించారు. ‘జనవరి 2025 నుంచి ఇప్పటి వరకూ 3,258 మంది భారతీయులను అమెరికా వెనక్కి పంపింది. వీరిలో 2,032 మంది అంటే సుమారు 62.3 శాతం మందిని సాధారణ వాణిజ్య విమానాల ద్వారా స్వదేశానికి పంపింది. మిగిలిన 1,226 మందిని (37.6 శాతం) యుఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించే చార్టర్ విమానాల్లో భారత్‌కు తరలించిందిని జైశంకర్ వెల్లడించారుగత ఐదేండ్లలో విదేశీ ఇమ్మిగ్రేషన్ అధికారులు 62 మంది భారతీయ విద్యార్థులకు అమెరికాకు వెళ్లకుండా నిరాకరించారని కేంద్రం తెలిపింది. ఈ మేరకు రాజ్యసభలో ఒక ఎంపీ ప్రశ్నకు విదేశాంగ సహా మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ రాతపూర్వక సమాధానం ఇచ్చారు. అలాగే 11 మంది విద్యార్థులను కిర్గిజ్‌స్తాన్‌కు వెళ్లకుండా నిరాకరించారు. అయితే గత ఐదేండ్లలో యూకే 170 మంది, ఆస్ట్రేలియా 114 మంది, రష్యా 82 మంది, అమెరికా 45 మంది, ఉక్రెయిన్ 13 మంది, ఫిన్‌లాండ్ ఐదుగురు ఇండియా విద్యార్థులను బహిష్కరించాయి.

# ఏపీలో పెరగనున్న 50 నియోజకవర్గాలు

నెల్లూరు, డిసెంబర్ 5, ఏపీలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలు పెరగనున్నాయి. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఏపీ విభజన సమయంలోనే తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్య పెరుగుతుందని చెప్పుకొచ్చారు. అయితే విభజన జరిగి పదేళ్లు దాటుతున్న ఇంతవరకు నియోజకవర్గాల సంఖ్య పెరగలేదు. దీనికి కారణం జనగణన, కుల గణన జరగకపోవడమే. అయితే వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి జనగణన ప్రారంభం కానుంది. 2027 ఫిబ్రవరి వరకు కొనసాగనుంది. అటు తరువాత కుల గణన మొదలుకానుంది. రిజర్వేషన్ల అంశము ఒక కొలిక్కి రానుంది. అప్పుడే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తవుతుంది. 2029 నాటికి నియోజకవర్గాల పునర్విభజన పూర్తి చేసి ఎన్నికలకు వెళ్లాలన్నది కేంద్ర ప్రభుత్వ ప్రణాళికగా తెలుస్తోంది.ఏపీలో దాదాపు 50 అసెంబ్లీ నియోజకవర్గాలు పునర్విభజనలో పెరగనున్నాయి. ప్రతి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లు పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. తద్వారా ఇప్పుడు ఉన్న 175 అసెంబ్లీ సీట్లకు గాను.. అదనంగా మరో 50 సీట్లు పెరుగుతాయి. 225 అసెంబ్లీ స్థానాలతో ఏపీ శాసనసభ కొలువుదీరనుంది. 294 అసెంబ్లీ స్థానాలతో పటిష్టమైన స్థితిలో ఉండేది ఉమ్మడి ఏపీ. 42 పార్లమెంట్ స్థానాలు ఉండేవి. తెలంగాణ విభజనతో ఆ రాష్ట్రానికి 117 అసెంబ్లీ సీట్లతో పాటు 17 పార్లమెంట్ స్థానాలు దక్కాయి. ఏపీకి మాత్రం 175 అసెంబ్లీ సీట్లతో పాటు 25 పార్లమెంట్ స్థానాలు మిగిలాయి. పునర్విభజనతో ఏపీతోపాటు తెలంగాణలో సైతం సీట్లు పెరుగుతాయి.చివరిసారిగా 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అప్పుడు కేంద్రంలో యూపీఏ అధికారంలో ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టింది. ఆ సమయంలో పునర్విభజన జరగడంతో అధికార కాంగ్రెస్ పార్టీకి లాభించింది. అప్పట్లో టిడిపికి బలమైన నియోజకవర్గాలను అడ్డగోలుగా చీల్చారు. రిజర్వేషన్లను సైతం మార్చేశారు. అయితే పునర్విభజన ఎప్పుడు జరిగినా అధికార పార్టీకి ప్రయోజనమే. పైగా ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామి. ఆపై బిజెపి సైతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంది. పైగా మూడు పార్టీలు 2029 ఎన్నికల్లో కలిసి వెళ్లేందుకు నిర్ణయం తీసుకున్నాయి. దీంతో సహజంగానే సీట్ల సంఖ్య పెరిగితే కూటమిలో అభ్యర్థులకు సర్దుబాటు చేయడానికి వీలుంటుంది. అయితే అధికార పార్టీలో సర్దుబాటు కాని వారు అసంతృప్తితో ఉంటారని.. వారంతా తమ వైపు వస్తారని అంచనా వేస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.

# కన్న తల్లి కర్కషం



దేవరకొండ భార్యాభర్తల మధ్య ఉన్న విభేదాలతో ఓ కన్నతల్లి తన ఐదు నెలల వయసు ఉన్న కుమారుడిని అడవి శాఖ వాహనంలో వదిలి వెళ్ళిన ఘటన గురువారం నల్గొండ జిల్లా దేవరకొండ పట్టణంలో జరిగింది ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఐసిడిఎస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం దేవరకొండ అటవి శాఖ అధికారులు గురువారం సాయంత్రం డిండి రోడ్డు వైపు వెళ్తూ తాటుకోల్ ఎక్స్ రోడ్డు వద్ద తమ వాహనాన్ని రోడ్డు పక్కనే ఆపి టీ తాగేందుకు వెళ్లారు ఆ క్రమంలో ఒక మహిళ ఐదు నెలల వయసు గల బాలుడిని జీపు సీట్లో వదిలిపెట్టి వెళ్ళింది టీ తాగి జీప్ దగ్గరికి వచ్చిన అడవి శాఖ అధికారులు జీపులో శిశువు ఏడుస్తూ కల్పించాడు దాంతో శిశువును దేవరకొండ పోలీస్ స్టేషన్ తరలించి విషయాన్ని ఐసిడిఎస్ అధికారులకు పోలీసు వారు సమాచారం అందించారు పోలీసులు ఐసిడిఎస్ అధికారులు విచారణ జరిపి బాబును జీపులో వదిలి వెళ్ళిన కన్నతల్లిని పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చి విచారణ జరిపి వివరాలు సేకరించారు భర్తతో కలిసి సూర్యాపేటలో ఉంటారని వారిద్దరి మధ్య విభేదాలు రావడంతో తిప్పర్తి లోని తన తల్లి గారి వద్ద ఉంటునట్లు వదిలి వెళ్లాననే ఆలోచనతో దేవరకొండకు వచ్చిందని కన్న తల్లికి కౌన్సిలింగ్ చేసి ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

# సర్పంచ్ అభ్యర్థి మృతి




రాజన్న సిరిసిల్ల వేములవాడ మండలం చింతల్ ఠాణా ఆర్ అండ్ ఆర్ కాలనీలో విషాదం నెలకొంది. సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చర్ల మురళి గుండెపోటుతో మృతి చెందాడు. దాంతో గ్రామంలో తొలి విడత 11న జరిగే పోలింగ్ పై సందిగ్ధత నెలకొంది.

# భార్య గెలుపు కోసం భర్త పాదయాత్ర

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లైన్అండాకు చెందిన తావూ నాయక్ గత సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసి 56 ఓట్ల తేడాతో ఓటమి చెందాడు. ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో తన భార్య పుష్పను సర్పంచ్గా బరిలో దింపాడు. గ్రామస్తులు ఎక్కువ మంది ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లారు. దీంతో తన భార్య గెలుపుకోసం ఓటర్లను కలిసేందుకు గ్రామం నుంచి పాదయాత్రగా బుధవారం హైదరాబాద్ బయలుదేరాడు. గ్రామా నికి చెందిన 450 మంది ఓటర్లు హైదరాబాద్ కు వలస పోగా.. వారిని ఓటు అభ్యర్థిం చడానికి గూడూరు శివాలయంలో పూజ చేసి నడక ప్రారంభిం చాడు. పాదయాత్ర నర్సంపేట మీదుగా సాగుతోంది..

# 87 లోన్ యాప్స్ తొలగింపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 5, కరోనా తర్వాత సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. లక్షల మంది ఉద్యోగులు కోల్పోవడం, ఉపాధి తగ్గిపోవడంతో కుటుంబ పోషణ కష్టమవుతుంది. ఇందుకోసం అప్పులు చేయాల్సి వస్తోంది. బయట అప్పులు దొరకడం కష్టం కావడంతో సామాన్యులు ఆన్లైన్ లోన్ యాప్స్ను ఆశ్రయిస్తున్నారు. వీటిల్లో అధిక వడ్డీ, సర్వీస్ ఛార్జీల రూపంలో వేలకు వేలు వసూలు చేస్తున్నా దిక్కుతోచని పరిస్థితుల్లో డబ్బులు తీసుకుంటున్నారు. ఎలాంటి డాక్యుమెంట్స్ అవసరం లేకుండా సెకన్లలోనే డబ్బులు అకౌంట్లో పడుతుండటంతో లోన్ యాప్స్కు ఆదరణ పెరుగుతోంది. కానీ తిరిగి డబ్బులు కట్టలేని పరిస్థితుల్లో రుణదాతలను లోన్ యాప్స్ నిర్వహాకులు బ్లాక్మెయిల్ చేయడం, వేధించడం లాంటివి చేస్తున్నారు. వీరి బాధ తట్టులేక ఆత్మహత్యలు చేసుకుంటున్నవారు కూడా ఉన్నారు.ఈ క్రమంలో లోన్ యాప్స్ ఆగడాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 87 అక్రమ లోన్ యాప్లను బ్యాన్ చేసింది. డేటా దుర్వినియోగంతో పాటు మోసం, వేధింపులకు పాల్పడుతున్నారనే కారణంతో వాటిపై నిషేధం విధించింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. ఐటీ చట్టంలోని 2000లోని 69ం సెక్షన్ల ఆధారంగా బ్యాన్ విధించినట్లు తెలిపింది. ఈ విషయాన్ని కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా లోకసభలో అధికారికంగా ప్రకటించారు. బ్యాన్ చేసిన వాటిల్లో ఆర్బీఐ అనుమతితో నడుస్తున్న యాప్లు కూడా ఉన్నాయి. బలవంతంగా రుణదాతల నుంచి వసూలు చేయండం, దోపిడీకి పాల్పడటంతో ప్రజల ఆందోళనలను తొగించేందుకు అక్రమ కార్యకలాపాలకు పాల్పడే యాప్లను తొలగించారు.నిరంతరం లోన్ యాప్లపై ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుందని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా చర్యలు తీసుకుంటామని మల్హోత్రా తెలిపారు. లోన్ యాప్స్పై కంపెనీల చట్టం 2013 ప్రకారం విచారణ, ఖాతాల తనిఖీ, వివరణాత్మక దర్యాప్తులతో సహా చర్యలు క్రమం తప్పకుండా తీసుకుంటామని వివరించారు.

# ఏకపక్షం అవుతున్న పంచాయితీ ఎన్నికలు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో తొలివిడత 20 గ్రామాల సర్పంచ్ లు ఏకగ్రీవం**

**3682 వార్డులో 1045 వార్డు సభ్యులు ఏకగ్రీవం**

**రెండు, మూడో విడతలో భారీగా ఏకగ్రీవం కానున్న పంచాయితీలు**

**ఏకగ్రీవమైన పంచాయితీలపై ప్రత్యేక దృష్టి పెట్టిన అధికారులు**

**ఉపసర్పంచ్ ని ఎన్నుకునే పనిలో నిమగ్నమైన ఏకగ్రీవమైన పంచాయితీలు**

హైదరాబాద్ తెలంగాణలో పంచాయతీ పోరు పీక్ స్టేజ్ కి చేరింది. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఇక ఏకగ్రీవాలపై రాజకీయ పార్టీల నాయకులతో పాటు గ్రామ పెద్దలు ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రలోభాలకు, వేలం పాటలకు తావు లేకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టడంతో రహస్యమంతనాలు గ్రామ అభివృద్ధి పేరుతో ఇప్పటికే పలు గ్రామాల సర్పంచ్ పదవులు, వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1224 గ్రామ పంచాయితీలు ఉండగా తొలి విడత పోలింగ్ జరిగే 398 గ్రామాల్లో సర్పంచ్, వార్డులకు ఒక్కొక్క నామినేషన్ వచ్చిన 20 గ్రామాల సర్పంచ్ లు, 1045 వార్డులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. తొలి విడతలో 8 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ తోపాటు వార్డులన్ని ఏకగ్రీవం కావడంతో అక్కడ ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

అత్యధికంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో ఏడు గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. కోనరావుపేట మండలంలో రెండు పంచాయితీల సర్పంచులు వార్డు సభ్యులు ఏకగ్రీవం అయ్యారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం దేశాయిపేట పంచాయతీ మొత్తం, పెద్దకుర్మపల్లి సర్పంచ్ తో పాటు కొన్ని వార్డులు రామడుగు మండలం శ్రీరాములపల్లి సర్పంచ్ ఏకగ్రీవం అయింది. పెద్దపల్లి జిల్లాలోని మంథని మండలం తోటగోపయ్యపల్లి సర్పంచ్ తోపాటు అన్ని వార్డులు, మైదుపల్లి, నాగారం, రామగిరి మండలం చందనాపూర్ లో సర్పంచ్ లు ఏకగ్రీవం అయ్యారు. జగిత్యాల జిల్లాలో ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్, యామపూర్ కథలాపూర్ మండలం రాజారాం తండా మెట్పల్లి మండలం చింతలపేట్ పంచాయతీల సర్పంచ్ లు ఏకగ్రీవమయ్యాయి.ఏకగ్రీవమైన సర్పంచులు వార్డు సభ్యులు సంబరాల్లో మునిగితేలుతున్నారు. కొందరికి రిజర్వేషన్ కలిసొంచి ఏకగ్రీవం కాక, మరికొందరు గ్రామంలో సొంత డబ్బులతో గుడి తోపాటు పలు అభివృద్ధి పనులు చేస్తామని ఏకగ్రీవమయ్యారు. గ్రామ అభివృద్ధి కాంక్షిస్తూ గ్రామస్తులంతా ఐక్యంగా సర్పంచ్ ని పలు వార్డులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందంటున్నారు.

# మళ్లీ ఉగ్రవాద దాడులు.. దేశం లో హైఅలర్ట్

న్యూఢిల్లీ, డిసెంబర్ 5, (న్యూస్ పల్స్) దేశంలో ఉగ్ర కార్యకలాపాలు చాపకింద నీరులా పెరుగుతున్నాయి. వేర్వేరు ఘటనలు వరుసగా బయటపడుతున్నాయి. అయితే అన్ని ఘటనలకూ ఒకే లింక్ ఉన్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 6 లేదా జనవరి 26 తేదీలను లక్ష్యంగా ఉగ్రవాద విజృంభణలు సాగుతున్నట్లు తెలుస్తోంది. బెంగాల్ నుంచి గుజరాత్ వరకు, ఢిలీ, కశ్మీర్, ఫరీదాబాద్, రాజస్థాన్ వంటి ప్రాంతాలలో పేలుళ్ల కోసం ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాద కార్యకర్తలు విడివిడిగా ఉన్నా, ఉత్తర భారతదేశంలో భారీ అగ్ని సృష్టించేందుకు సన్నాహకాలు చేస్తున్నారని అనుమానాలు ఉన్నాయి.అల్ ఫలా యూనివర్సిటీ పరిధిలో ఉగ్ర డాక్టర్లు ఇస్తున్న సమాచారంతో ఇంటలిజెన్స్, పోలీసులు, భద్రతాదళాలు ఉగ్ర లింకులు, ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నవారి కోసం వెతుకుతున్నారు. సారంపూర్లో జైష్ ఎ మహ్మద్ మహిళా విభాగాన్ని నిర్వహించే ఉగ్ర మహిళా డాక్టర్ పట్టుబడింది. నూహూ ప్రాంతంలో ఉగ్రులకు అవాంతరం కల్పించేవారు అడ్వకేట్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, మత బోధకులు కూడా ఉన్నారు.గుజరాత్లో రిసిన్ అనే విష పదార్థాలను ఆహార, ప్రసాదాలపై కలిపే ప్రయత్నం జరిగింది. రాజస్థాన్లో నంబర్ ప్లేట్ లేకుండా అనుమానాస్పదంగా పట్టుకున్న వాహనంలో 981 జిలిటెన్ స్టిక్స్, 93 డిటోనేటర్స్, పీజ్ వైర్లు, టైమర్లు కనుగొన్నారు. అల్ ఫలా యూనివర్సిటీ పరిధిలో 2,900 కిలోల పేలుడు పదార్థాలు దొరికాయి. ఒక ఉగ్రవాది పేలుడు పదార్థాలు తరలిస్తూ ఢిల్లీ ఎర్రకోట వద్ద పేల్చుకున్నాడు.ఈ ఉగ్ర కార్యకలాపాలకు పాకిస్తాన్ ఐఎస్ఐ సపోర్ట్ చేస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. తుర్కీ, ఖతర్ వలె దేశాల పేర్లతో ఐఎస్ఐ హ్యాండిల్ చేస్తోంది. బంగ్లాదేశ్ మద్దతులో కూడా ఉగ్రవాద చర్యలు పెరుగుతున్నాయి. అందరి లక్ష్యం డిసెంబర్ 6 లేదా జనవరి 26 దేశంలో విధ్వంసం సృష్టించడమే అని తెలుస్తోంది. రాజస్థాన్లో ఒసామా ఉమర్, ఖాసీం మౌలానా వంటివారు యువతను ఉగ్రవాద వైపు మళ్లిస్తున్నారు. మహారాష్ట్ర గ్రామాల పేర్ల మార్పు, హైదరాబాద్ నుంచి బిహార్కు పేలుడు సరుకుల రవాణా వంటి సంఘటనలు దేశంలో వివిధ చోట్ల ఉగ్రమూలాలకు ఆధారం.

# తెలంగాణలో మళ్లీ సెంటిమంట

హైదరాబాద్, డిసెంబర్ 5, తెలంగాణలో రాజకీయాలు మారుతున్నాయి. తెలంగాణ సెంటిమెంటును వాడుకోవాలని, తద్వారా మరో ఐదేళ్లు అధికారంలో ఉండేలా చూసుకోవలని రేవంత్ సర్కార్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది.

వైఎస్సార్ ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి టీఆర్ఎస్తో పొత్తు పెట్టుకున్నారు. తర్వాత తెలంగాణ వాదాన్ని అణచివేయాలని చూశారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడం కోసం తెలంగాణ వాదాన్ని పునరుద్ధి పెడుతున్నట్లు అనిపిస్తోంది.రాజశేఖరరెడ్డి తెలంగాణ వాదం ప్రారంభించినా.. తర్వాత వ్యతిరేకించాడు. వైఎస్సార్ మరణం తర్వాత ఉద్యమం మరింత ఉధృతమైంది. కేసీఆర్ ఆమరణ దీక్షతో రాష్ట్ర విభజన సాధించాడు. దీంతో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ప్రజాస్వామ్య పాలన మెరుగుపరుచడంతో హైదరాబాద్ వంటి నగరాల్లో స్థిరత్వం కొనసాగింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్కు ప్రజలకు మద్దతు లభించిందికాంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాలు సాధించినప్పటికీ, పల్లె ప్రాంతాల్లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై చర్చ జరుగుతోంది. పంచాయతీ ఎన్నికల వేళ.. ఇది మరింత ఎక్కువైంది. రైతుబంధు వాయిదా పడటం, హామీల అమలు కాకపోవడంతో ప్రజలు నిలదీస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ వాదంతో అస్థిరత స్త?టంచడం కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది.ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల తెలంగాణ దిష్టి తగలడంతో కోనసీమ పచ్చదనం కోల్పోతోందని పేర్కొన్నారు. దీనిపై కాంగ్రెస్ ఆలస్యంగా స్పందించింది. ఇప్పుడు దీనిపైనే రాజకీయం చేస్తోంది. తెలంగాణకు పవన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తోంది. లేదంటే సినిమాలు ఆడనివ్వమని మంత్రి కోమటిరెడ్డి స్వయంగా హెచ్చరించారు. బీఆర్ఎస్ కూడా పవన్ వ్యాఖ్యలను ఖండించింది. కానీ కాంగ్రెస్ దీనిని రాజకీయం చేస్తోంది. తెలంగాణ?ఆంధ్ర కేఫ్ సెంటిమెంట్ వేడెక్కించడంతో, రాజకీయ వాతావరణంలో మరింత ఉద్రిక్తత ఏర్పడుతోంది.తాజా పరిణామాలతో రెండు రాష్ట్రాల మధ్య శాంతి, అభివృద్ధి వాతావరణంలో ఉద్రిక్తతలకు దారితీయొచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. రాజకీయాలకన్నా స్థిరత్వం అవసరమని పేర్కొంటున్నారు.

కోమటిరెడ్డిని టార్గెట్ చేసిన ఫ్యాన్స్

పవన్ కళ్యాణ్ కోనసీమ పర్యటన లో తెలంగాణ నాయకులను ఉద్దేశించి చేసిన కామెంట్స్ రాజకీయంగా పెను దుమారమే రేపింది. ఎక్కడ చూసినా ఇప్పుడు దీని గురించే చర్చ. ముందుగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ అంశంపై మాట్లాడారు, విమర్శలు చేశారు, కానీ పెద్ద రేంజ్ కి తీసుకెళ్లింది మాత్రం కాంగ్రెస్ పార్టీ నాయకులే. మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తులు పవన్ కళ్యాణ్ పై వరుసగా దాడి చేయడం మొదలు పెట్టారు. ముఖ్యంగా సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటి రెడ్డి మాట్లాడిన మాటలు పవన్ కళ్యాణ్ అభిమానులను ఒక రేంజ్ లో ట్రిగ్గర్ చేసింది. పవన్ కళ్యాణ్ సినిమాలను ఇక మీదట మా తెలంగాణ లో ఆడనివ్వం, వెంటనే ఆయన క్షమాపణలు చెప్తే ఆలోచిస్తాం, ఇది సినిమాటోగ్రఫీ మినిస్టర్ గా నా మాట అంటూ ఆయన వార్నింగ్ ఇవ్వడం పై పవన్ ఫ్యాన్స్ సోషల్ మీడియా లో రెచ్చిపోయారు.ఇలాంటి బెదిరంపులకు లొంగేవాళ్ళం కాదు, ఇలాంటివి ఆంధ్ర ప్రదేశ్ లో మా నాయకుడు ఎన్నో చూసి ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి హోదా లో కూర్చున్నాడు. మా సినిమాని ఆపేంత దమ్ము ఉంటే ప్రయత్నం చెయ్యి, చూసుకుందాం అంటూ కోమటి రెడ్డి ని ట్విట్టర్ లో ట్యాగ్ చేసి ఒక రేంజ్ లో తిట్టడం మొదలు పెట్టారు. అంతే కాదు గతం లో కోమటి రెడ్డి ఆంధ్ర ప్రజల పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను కూడా సోషల్ మీడియా లో అప్లోడ్ చేసి నిలదీస్తున్నారు. ఇలా నాన్ స్టాప్ గా పవన్ ఫ్యాన్స్ నుండి దాడి ఎదురు అవ్వడం తో, కోమటి రెడ్డి సిబ్బంది పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు తనపై అసభ్య వ్యాఖ్యలు చేసిన కొంతమంది పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ట్విట్టర్ అకౌంట్స్ కి సంబంధించిన లింకులను ఆధారాలతో సహా సీసీఎస్ లో ఫిర్యాదు చేశారట.పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ఏ మాత్రం బెదరడం లేదు, పోలీస్ కేసులతో మమ్మల్ని అడ్డుకోలేరు, మా నాయకుడి జోలికి వస్తే ఎంత దూరం వెళ్లడానికైనా సిద్ధం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ వ్యవహారం ఎక్కడ దాకా వెళ్లి ఆగుతుందో చూడాలి. కాంగ్రెస్ పార్టీ నాయకులు అనవసరం పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ తో పెట్టుకుంటున్నారు అంటూ రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఎందుకంటే తెలంగాణ ప్రాంతం లో పవన్ కళ్యాణ్ కి విపరీతమైన ఫ్యాన్ బేస్ ఉంది. పైగా తెలంగాణాలో జనసేన పార్టీ క్రియాశీలక పాత్రలో లేదు, కాంగ్రెస్ పార్టీ ఓటర్లలో పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అత్యధిక భాగం ఉంటారు. వాళ్ళ ఓట్లను కోల్పోయిన వాళ్ళు అవుతారు. పవన్ కళ్యాణ్ వీడియో లో అంత స్పష్టంగా తెలంగాణా నాయకులు అని అసంబోదించినా కూడా తెలంగాణ ప్రజలను అన్నట్టు రచ్చ చేయడం కాంగ్రెస్ కి బ్యాక్ ఫైర్ అయ్యే అంశమే అని చెప్పొచ్చు.

## తాళ్లపల్లి లో సర్పంచ్ అభ్యర్దుల భేటీ
## కేసు నమోదు

సిద్దిపేట జిల్లా అక్బర్పేట- భూంపల్లి మండలం తాళ్ల పల్లిలో ఒక సామాజిక వర్గం ఆ గ్రామంలోని ఓ ఆలయం వద్ద బుధవారం సర్పంచులుగా పోటేస్తున్న ఐదుగురితో సమావేశం నిర్వహించారు. తమ సామాజికవర్గానికి చెందిన ఆలయాభివృద్ధికి ఎవరరెంత డబ్బు ఇస్తారో వారికే ఓటు వేయాలని నిర్ణయించుకున్నాడు. విషయం తెలుసుకున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భూంపల్లి ఎస్ఐ హరీశ్, సిబ్బంది వెళ్లి వారిని పోలీస్ స్టేషన్కు తరలించారు. అనుమతి లేకుండా సమావేశం నిర్వహించడంతోపాటు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం లాంటి సెక్షన్లో 63 మందిపై కేసు నమోదు చేశారు. గ్రామస్తులకు పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు.

## సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తికి మద్దతు ధర

## - పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు

పెద్దపల్లి మండలంలోని నిమ్మనపల్లి మహాలక్ష్మి జిన్నింగ్ మిల్లులో గురువారం సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిన్నింగ్ మిల్ యాజమాన్యంతో కలిసి పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు ప్రారంభించారు. అనంతరం రైతు కలవేన మల్లేశంకు చెందిన 27. 80 క్వింటాళ్ల పత్తిని కోనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ నాణ్యమైన ఏ గ్రేడ్ పత్తికి క్వింటాలుకు రూ. 8100 మద్దతు ధర ప్రభుత్వం చెల్లిస్తున్నట్లు తెలిపారు. 8 నుండి 12 శాతం లోపు తేమ ఉండేలా పత్తిని సిసిఐ కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని రైతులను కోరారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక పంటల దిగుబడి తగ్గిందన్నారు. రైతు లు పంటల మార్పిడీపై దృష్టి సారించాలని సూచించారు. వరి పొలాలు కోసిన తరవాత కోయకాలుకు రైతులు నిప్పు పెట్టడం వల్ల భూసారం తగ్గుతుందని, పంటకు ఉపయోగపడే సారవంతమైన కీటకాలు నశించి పంటల దిగుబడి తగ్గుతుందని రైతులు పంట అవశేషాలను భూమిలో కలియదున్నాలని తెలిపారు. పత్తి చివరి దశలో ఉన్నదని, దాని స్థానంలో యాసంగి సాగుగా మొక్కజొన్న సాగుతో అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. హైబ్రిడ్ సీడ్ మొక్క జొన్న సాగుతో ఎక్కువ దిగుబడి సాధించి లాభాలు పొందవచ్చని, ఆదిశగా రైతులు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల పంటల సాగుకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జిన్నింగ్ మిల్ యజమానులు నర్సింగరావు, మంగారావు, సిసిఐ అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన కూడళ్లలో షి టీం నిఘ.

కమాన్ పూర్ . గ్రామాలలోని ప్రధాన కూడళ్ళు బస్టాండ్ ల పాఠశాలల వద్ద షి టీం నిఘ. ఉంటుందని ఇన్చార్జి షీ టీం ఎస్సై లావణ్య అన్నారు.రామగుండం సి.పి ఆదేశాల మేరకు, షీ టీమ్ ఇంచార్జి ఎస్సై లావణ్య ఆధ్వర్యంలో కమాన్ పూర్ మండలం, జూలపల్లి గ్రామం లోని జడ్పీహెచ్ఎస్ హై స్కూల్ విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్,ఎవరైనా చెడు గా మాట్లాడిన, ప్రవర్తించిన తల్లిదండ్రులకు చెప్పాలని, మరియు వాటి నుంచి ఎలా బయటపడటం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని, సోషల్ మీడియా ప్రభావం వలన జరిగే ఇన్సిడెన్స్ గురించి, తల్లి దండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు.ఈ కార్యక్రమం లో షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్, మరియు హెడ్ మాస్టర్ సుజాత మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ తేజకు అల్లు ఏం చేశాడో తెలుసా

హైదరాబాద్, డిసెంబర్ 5, అదో యాక్సిడెంట్.. కావాలని చేసింది కాదు.. జరిగిన ఘోరానికి ఆయన అసలు బాధ్యుడు కాదు.. అయినా ఆయన్నే టార్గెట్ చేశారు. ప్రాణం పోయిందని.. ఒక ప్రాణం ఊపిరిపై ఉందని ఆడిపోసుకున్నారు.. అయినా ఆ హీరో పద్దాడు. ఆ కుటుంబానికి జీవితంలో చూడనంత , అందుకోలేనంత సాయం చేశాడు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఇ శ్రీతేజ్ ను బతికించాడు.

అయినా ఇప్పటికీ ఆ అపనిందలు అల్లు అర్జున్ మోస్తూనే ఉన్నాడు. శ్రీతేజ్ కుటుంబానికి ఎంతో చేసినా చెప్పుకోలేని స్థితిలో బన్నీ ఉన్నాడు. కానీ కొన్ని వక్రమీడియాలు మాత్రం బన్నీని టార్గెట్ చేసి శ్రీతేజ్ ను పావుగా వాడుతూ ఇప్పటికీ విషం చిమ్ముతూనే ఉన్నాయి. బన్నీ ఆ కుటుంబానికి ఎంత చేశాడన్నది మాత్రం ఎవరూ చెప్పడం లేదు. ఆ నిజాన్ని బయటపెట్టడం లేదు. కొంతకాలంగా సోషల్ మీడియాలో హీరోల మీద, ముఖ్యంగా అల్లు అర్జున్ మీద జరుగుతున్న నిరాధారమైన, ద్వేషపూరిత ప్రచారం చూస్తే చాలా బాధ కలుగుతోంది. ఒక విషయాన్ని గురించి పూర్తి నిజాలు తెలుసుకోకుండా కేవలం హీరోల మధ్య 'ఫ్యాన్ వార్స్' కోసం ఇంత చీప్‌గా, నెగటివ్‌గా ప్రచారం చేయడం వల్ల ఎవరికి ఏమీ ఒరగదు. కనీసం ఇలాంటి సున్నితమైన విషయాల్లోనైనా సంయమనం పాటిద్దాం.ఇప్పుడు అల్లు అర్జున్ ? శ్రీతేజ్ అంశం మరోసారి వార్తల్లో నిలుస్తోంది.. కొందరు కావాలనే అసత్య సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ అల్లు అర్జున్‌పై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నారు.

కానీ, నిజంగా అక్కడ ఏం జరిగింది, శ్రీతేజ్ కోసం అల్లు అర్జున్ ఎంత చేశారు అనే వాస్తవాలను ఒకసారి పరిశీలిద్దాంతొక్కిసలాట ఘటనలో గాయపడిన శ్రీతేజ్ చికిత్స కోసం అల్లు అర్జున్ ఇప్పటివరకు దాదాపు ? 3.25 కోట్లు ఖర్చు చేశారు.ఇందులో ? 1.5 కోట్లు శ్రీతేజ్ భవిష్యత్తు కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో ఉన్నాయి. దీనిపై ఇప్పటివరకు వచ్చిన ? 17 లక్షల వడ్డీని కూడా బ్యాంక్ శ్రీతేజ్ తండ్రికి అందజేసింది. పెండింగ్‌లో ఉన్న హాస్పిటల్ ఖర్చులు ? 75 లక్షల దాకా అల్లు అర్జున్ స్వయంగా చెల్లించారు. చికిత్స తర్వాత శ్రీతేజ్ కోసం అయ్యే రిహాబిలిటేషన్ ఖర్చు కూడా తామే భరిస్తామని అల్లు అర్జున్ బృందం చెప్పింది. అయితే దీనికి దిల్ రాజు గారు మధ్యవర్తిగా ఉండి, "ఆ బాధ్యత నేను చూసుకుంటాను" అని చెప్పినట్లు తెలుస్తోంది. ఇంత మొత్తం ఖర్చు పెట్టి, ఒక బాధిత కుటుంబానికి అండగా నిలబడి, భవిష్యత్తు కోసం కూడా ఆర్థిక భరోసా కల్పించిన వ్యక్తిని, కేవలం ద్వేషంతో, అభూత కల్పనలతో విమర్శించడం ఎంతవరకు సమంజసం?ఒక వ్యక్తి ఇంత పెద్ద మనసుతో సహాయం చేసిన తరువాత కూడా ఇక వదిలేస్తారా? అని ప్రశ్నించడం చాలా దురదృష్టకరం. అసలు ఆ సహాయం చేయాలనే బాధ్యత లేకపోయినా, మానవత్వంతో ముందుకు వచ్చి ఇంత చేసిన తరువాత కూడా వారిపై విమర్శలు చేయడం, నెగటివ్ ప్రచారం చేయడం దారుణం.ఫ్యాన్ వార్స్ ఎంతవరకైనా పర్వాలేదు.. కానీ మానవత్వం, నిజ జీవితంలో జరిగిన సహాయం వంటి విషయాల్లో కూడా తప్పుడు సమాచారాన్ని షేర్ చేయకుండా ఉండటం ఉత్తమం. హీరోల పట్ల ఉండే ద్వేషాన్ని పక్కన పెట్టి, వాస్తవాలను గ్రహించాలి. ఇటువంటి ప్రచారాలు ఆపేసి, నిజమైన సమాచారాన్ని మాత్రమే పంచుదాం.

# సర్పంచ్ ఎన్నికల్లో ఫ్యామిలీ ఫైట్

కరీంనగర్, డిసెంబర్ 5 తెలంగాణలో పంచాయతీ ఎన్నికలతో పల్లెల్లో రాజకీయ వేడి రాజుకుంది. మొదటి విడత ఎన్నికలకు గుర్తులు కూడా కేటాయించారు. మరోవైపు రెండో విడత నామినేషన్ల స్వీకరణ పూర్తయింది. మూడో విడత నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఈ క్రమంలో పల్లెల్లో ఆసక్తికర పోటీ కనిపిస్తోంది. కుటుంబ సభ్యులు, బంధువులు, అన్నదమ్ములు, అక్క చెల్లెళ్లు, అత్త కోడళ్లు పోటీలో ఉంటున్నారు ఆదిలాబాద్ జిల్లాలో అన్నదమ్ములు, అత్త కోడలు బరిలో నిలిచారు. ఇక జగిత్యాల జిల్లాలో ఒకే ఇంట్లో ముగ్గురు పోటీలో నిలిచారు.జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామంలో రాజకీయ వాతావరణం ఆసక్తికరంగా మారింది. ఈ గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులు ? పుల్ల పుష్పలత (భార్య), పుల్ల సాయగౌడ్ (భర్త), పుల్ల వెంకటేశ్ (కొడుకు)? సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నారు. ఇప్పటికే 12 మంది అభ్యర్థులు పోటీపడుతోన్న ఈ ఎన్నిక వివాదాస్పదంగా నిలుస్తోంది. కుటుంబ సభ్యుల మధ్య ఓట్ల విభజన, శక్తి పోరాటం గ్రామ రాజకీయాల్లో కొత్త విషాదాన్ని తెస్తోంది. ఈ పరిణామం స్థానిక రాజకీయాలలో చర్చనీయాంశంగా మారింది.ఇటువంటి పరిస్థితులు గ్రామ ప్రజల్లో రాజకీయ ఎన్నికలపై ఆసక్తిని పెంచాయి. కానీ కుటుంబ విభేదాలకు కూడా దారితీస్తాయి. పోటీ రాజకీయ సంప్రదాయాన్ని కొద్దిగా భిన్నంగా చూపుతుంది. అయితే ఎవరు గెలిచినా పాలించేది మాత్రం ఆ కుటుంబమే. ఈ నేపథ్యంలో గ్రామాభివృద్ధిలో ఈ ఎన్నికల యొక్క ప్రభావం పై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

సిద్ధిపేటలో..

సర్పంచ్ పదవికి నామినేషన్ లో ఎన్నో ఘటనలు చోటు చేసుకుంటూ ఉన్నాయి. సిద్ధిపేట జిల్లా అక్బర్‌పేట?భూంపల్లి మండలం జంగపల్లి సర్పంచ్ పదవి జనరల్ మహిళకు రిజర్వు అయ్యింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇద్దరు భార్యలు ఉన్నారు. నవంబర్ నెల 30న తన మొదటి భార్యతో సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ దాఖలు వేయించారు. నామినేషన్ పత్రాల్లో ఏవైనా తప్పులు ఉంటే స్రూ?కటినీలో ఎక్కడ తొలగిస్తారోనన్న భయంతో రెండో భార్యతో మరో నామినేషన్ వేయించారు. నామినేషన్ల దాఖలు ముగిసే సమయానికి ఈ ఇద్దరే పోటీలో ఉన్నారు. వీరిలో ఒకరు నామినేషన్ ఉపసంహరించుకుంటే సర్పంచ్ పదవి ఏకగ్రీవంకానుంది.

# తూకంలో తేడాలు...భగ్గుమంటున్న అన్నదాతలు

హైదరాబాద్, డిసెంబర్ 5, రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని చెప్తున్న మరోవైపు అధికారులు ఆచరణలో విఫలమవుతున్నారు. రైతులకు గిట్టుబాటు ధరను అందిస్తామని భరోసా ఇచ్చిన కార్యాచరణ లో మాత్రం అమలు చేయడం లేదు. సకాలంలో రైతుల ధాన్యానికి తూకం జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యాన్ని ఎండలో ఆరబోసాం.. తూకం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ధాన్యానికి సకాలంలో తూకం జరుగకకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.15 రోజుల నుంచి ధాన్యాన్ని ఆరబోసుకొని కూర్చున్నా ధాన్యానికి తూకం వేయడం లేదు. స్థానిక సింగిల్ విండో అధికారులు ఏమాత్రం పట్టనట్టు వివరిస్తున్నారు. ఈ విషయమై అధికారులకు చెప్పిన పట్టించు కోవడం లేదని కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని రైతులు బోరుమంటున్నారు. ప్రభుత్వం వరి ధాన్యానికి మద్దతు ధర అందించి ఆదుకుంటామని భరోసా ఇచ్చింది కానీ సకాలంలో రైతుల ధాన్యానికి తూకం వేయడం లేదు.అధికారులు ఇలా వచ్చి అలా వెళ్ళిపోతున్నారే కానీ రైతుల పరిస్థితిని పట్టించుకోవడంలేదని వారు మండి పడుతున్నారు. తాడ్వాయి మండలంలోని నందివాడ, కృష్ణాజివాడి, బ్రాహ్మణపల్లి, తాడ్వాయి గ్రామాల్లో రైతులు కల్లాల్లో దాన్యాన్ని ఆరబోసి తూకం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. అధికారులు సకాలంలో స్పందించి వెంటనే తూకం వేయాలని రైతులు కోరుతున్నారు. తమ ధాన్యాన్ని ఆరబోసుకొని తూకం కోసం ఎదురు చూస్తున్నారు. ఎప్పుడు వచ్చి తమ ధాన్యానికి తూకం వేస్తారని ఆరాటపడుతున్నారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని గ్రామాలలో అధికారులు తూకం వేసిన ధాన్యాన్ని తరలించడం లేదు. దీంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళలో ధాన్యం వద్దకు వెళ్లి అక్కడే పడుకుంటున్నారు.

# కేసీఆర్ ఇకదూరమేనా

హైదరాబాద్, డిసెంబర్ 5,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా పార్టీని పక్కన పెట్టేసినట్లే కనపడుతుంది. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలోనూ ఆయన బయటకు రాలేదు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల విషయంలోనూ ఆయన ఎలాంటి అడుగు వేయలేదు. కనీసం మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గాల ఇన్ ఛార్జులను పిలిచి కూడా ఒక సమావేశాన్ని కూడా కేసీఆర్ ఏర్పాటు చేయలేదు. తెలంగాణలో స్థానిక ఎన్నికల సమరం ఈ నెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయింది. అయినా కేసీఆర్ మాత్రం కనీసం ఎన్నికల విషయంలో ఎలాంటి జోక్యం చేసుకోకపోవడం ఇప్పుడు పార్టీలోనే చర్చనీయాంశంగా మారింది. ఇంకా కేసీఆర్ ఓటమి నుంచి తేరుకోలేకపోతున్నారా? అన్న అనుమానం కూడా కలుగుతుంది.ఇప్పటికే తెలంగాణలో ఎన్నికలు జరిగి దాదాపు రెండేళ్లు కావస్తుంది. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ దీక్షా దివస్ ను కూడా నిర్వహిస్తుంది. గ్రామస్థాయిలో సమరం ప్రారంభమయిన నేపథ్యంలో గులాబీ బాస్ మౌనం దేనికి సంకేతం అన్నది అర్థం కాకుండా ఉంది. పంచాయతీ ఎన్నికలు అంటే పార్టీ రహితంగా జరిగేవే కావచ్చు. పార్టీ గుర్తులు లేకపోయినప్పటికీ గ్రామాల్లో ఖచ్చితంగా ఆ యా పార్టీలకు సంబంధించిన వ్యక్తులే పోటీలో ఉంటారు. ఖచ్చితంగా పరోక్షంగా పార్టీ అభ్యర్థిగానే చూసి ప్రజలు ఓట్లు వేస్తారు. పంచాయతీ ఎన్నికలకు ఆయన ప్రచారం చేయకపోవచ్చు. కనీసం ప్రకటన కూడా కేసీఆర్ నుంచి రాకపోవడంపై బీఆర్ఎస్ శ్రేణులు నిరాశలో మునిగిపోయాయి.రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ వాటిపై స్పందించడానికి కూడా కేసీఆర్ బయటకు రావడం లేదు. మరొకవైపు కల్వకుంట్ల కుటుంబలో చీలిక వచ్చింది. ఆయన కుమార్తె తెలంగాణ జాగృతి తరుపున రాష్ట్రంలో పాదయాత్ర చేపట్టారు. మరొకవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ తిరుగుతున్నారు.

మరొకవైపు మేనల్లుడు మాజీ మంత్రి హరీశ్ రావు కూడా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. కానీ గులాబీ బాస్ గా కేసీఆర్ కనీసం ఫామ్ హౌస్ నుంచిబయటకు రాకపోవడం, నియోజకవర్గాల్లో నేతలకు దిశానిర్దేశం చేయడానికి ఉత్సాహం చూపకపోవడంపై పార్టీలో చర్చ జరుగుతుంది. ఆయన మరికొంత కాలం బయటకు రారని పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నప్పటికీ, కీలక సమయాల్లో రాకపోతే ఎలా? అన్న ప్రశ్న క్యాడర్ నుంచి వస్తుంది. మరి కేసీఆర్ ఇప్పటికైనా స్పందిస్తారా? లేదా? అన్నది చూడాలి.

# కాలేజీలపై ఫెనాల్టీల భారం..

హైదరాబాద్, డిసెంబర్ 5, విద్యాసంవత్సరం మొదలైందంటే చాలు.. డీఐఈవో (డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్)లు ఆడిందే ఆట, పాడిందే పాట. జిల్లాల్లోని జూనియర్ కాలేజీలపై పెత్తనం వారిదే. అనుమతులు, తనిఖీల్లో వారి పర్యవేక్షణ ఉంటుం ది. ఇదే వారికి కాసులు కురిపిస్తున్నాయి. ఇంటర్ బోర్డు నిబంధనలు ప్రైవేట్ కాలేజీలకు శాపంగా మారితే, డీఐఈవోలకు మాత్రం కాసుల వర్షం కురుపిస్తున్నాయనే ఆరోప ణలున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభంలో అఫిలియేషన్ కోసం ఇంటర్ బోర్డుకు జూనియర్ కాలేజీలు దరఖా స్తు చేసుకోవాల్సి ఉంటుంది.కాలేజీల నిర్వహణకు ఇంటర్ బోర్డు నుంచి గుర్తింపు రావాలంటే ఆ కళాశాల భవన రిజిస్ట్రేషన్ డీడ్ లేదా లీజు డీడ్, అప్రూవ్డ్ బిల్డింగ్ ప్లాన్, ఫైర్ సేఫ్టీ ఎన్‌వోసీ, మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ, కార్పస్ ఫండ్, స్ట్రక్చరల్ సౌండ్‌నెస్, శానిటరీ సర్టిఫికెట్‌లతోపాటు బోధనా సిబ్బంది డాక్యుమెంట్లు, ఆటస్థలం డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుంది. ఈ అన్నిరకాల అనుమతులు వివిధ శాఖల నుంచి తప్పనిసరిగా ఉండాల్సిందే. అప్పుడుగానీ ఆయా కాలేజీలకు ఆ విద్యాసంవత్సరం అడ్మిషన్లు చేపట్టడానికి ఇంటర్ బోర్డు అధికారులు గుర్తింపు ఇవ్వరు.సరిగ్గా ఈ నిబంధనలే కొంత మంది డీఈవోలకు వరంగా మారాయి. దరఖాస్తుతోపాటు సమర్పించాల్సిన ధ్రువపత్రాల్లో కీలకమైనవి ఫైర్ ఎన్‌వోసీ, మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ, శానిటరీ సర్టిఫికెట్‌లు. రాష్ట్రవ్యాప్తంగా ఈసారి 1,460 ప్రైవేట్ కాలేజీలు అఫిలియేషన్‌కు దరఖాస్తు చేసుకున్నాయి. అక్టోబర్ వరకు 1,368 కాలేజీలకు గుర్తింపు ఇచ్చేశారు. ఇంకా దరఖాస్తు పెండింగ్‌లో ఉన్న కాలేజీలు పదుల సంఖ్యలోనే ఉంటాయి. మొత్తం కాలేజీల్లో 200 వరకు ప్రైవేట్ కాలేజీలు గృహ, వాణిజ్య సముదాయా(మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ)లో నడుస్తున్నాయి.6-15 మీటర్లలోపు ఎత్తున్న భవనాలైతే అవసరమైన అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలి. 15 మీటర్ల కంటే మించితే అగ్నిమాపక శాఖ ఎన్‌వోసీ జారీచేయాలి.ఈ తరహా కాలేజీలు 90 శాతం హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లా పరిధిలోనే ఉన్నాయి. అయితే ఇటువంటి కాలేజీలకు అఫిలియేషన్ ఇవ్వాలంటే అగ్నిమాపక శాఖ ఎన్‌వోసీ సర్టిఫికెట్ జారీచేయాల్సి ఉంటుంది. ఈ సర్టిఫికెట్ లేకపోవడంతో కొన్ని కాలేజీల దరఖాస్తులను ఇంటర్ బోర్డు అధికారులు తిరస్కరిస్తున్నారు.తరహా కాలేజీల అనుమతులకు సంబంధించిన ఫైళ్లు ఇటు ఇంటర్ బోర్డులో, అటు సచివాలయంలో ఇంకా పదుల సంఖ్యలో ఉన్నాయి. వీటికి అనుమతులివ్వాలంటే పలువురు అధికారులు రూ.లక్షల్లో అమ్యా మ్యాలు అడుగుతున్నట్లు ఓ కళాశాల యజమాని తెలిపారు. దీంతోపాటు అనుకోని పరిస్థితుల్లో కాలేజీ భవన యజమానితో మనస్పర్థలు వచ్చి నిర్ధాక్షిణ్యం గా రెంటల్ కాలేజీ బిల్డింగ్‌ను యాజమాన్యాలు ఖాళీచేయాల్సి వస్తోంది.ఈ క్రమంలో వేరే మండలంలో ఆ కాలేజీను షిఫ్ట్ చేయాలంటే ప్రైవేట్ కాలేజీల యా జమాన్యాలకు తలనొప్పిగా మారింది. అధికారులు అనుమతులివ్వకపోగా వారు అడిగినంత ముట్టజెప్పాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక వారు ఎంతోకొంత ఇస్తే తీసుకోకపోగా పలువురు డీఐఈవోలు కాలేజీల యాజమాన్యాలతో బేరసారాలు ఆడుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఇంటర్ బోర్డు విధించే ఫెనాల్టీలతో చిన్నా చితక ప్రైవేట్ కాలేజీలు కుదేలు అయ్యే పరిస్థితి ఉంది. ఆర్థికభారం తడిచి మోపెడవుతున్నది. ఎన్‌వోసీ, శానిటరీ తదితర సర్టిఫికెట్ల కోసం సంబంధిత శాఖలకు దరఖాస్తు చేసుకుని, ఆ సర్టిఫికెట్ జారీ అయ్యే క్రమంలో జాప్యమవుతోంది. దీంతో అఫిలియేషన్, షిఫ్టింగ్, పరీక్ష ఫీజు పేర్లతో ఇష్టానుసారంగా ఫెనాల్టీలను విధిస్తున్నారని పలు ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు పేర్కొంటున్నాయి.అఫిలియేషన్‌కు రూ. లక్ష, అనాథరైజ్డ్ షిఫ్టింగ్‌కు రూ. 5 లక్షల నుంచి ఆపైన లేట్ ఫీజును విధిస్తున్నారు. ఇవి చెల్లించినా.. అధికారులకు అనధికారికంగా 'ఫీజులు' చెల్లించుకోవాల్సిందే. కాలేజీల షిఫ్టింగ్‌కు కూడా రూ. లక్ష నుంచి లక్షన్నర ముడుపులు అడుగుతున్నట్లు సమాచారం. ఇక ఎన్‌వోసీ జారీకి అంతకుమించి రెండు రెట్లు అడుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇది ఇంటర్ బోర్డు స్థాయిలో మాత్రమే.సచివాలయం స్థాయిలో అయితే అఫిలియేషన్, ఎన్‌వోసీ, మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ, షిఫ్టింగ్‌కు కోసం భారీస్థాయిలో ముడుపులు ముట్టజెప్పాల్సి వస్తోందని ఆరోపణలున్నాయి. సర్టిఫికెట్లు లేవని దరఖాస్తును రిజక్ట్ చేసిన అధికారులు, ఫెనాల్టీలు ఎందుకు వేస్తున్నారని పలు కాలేజీల యాజమాన్యాలు ప్రశ్నిస్తున్నాయి. పైగా ఏమైనా దరఖాస్తుల కోసం సంబంధిత శాఖకు అర్జీ పెట్టుకుంటే, ఆ సర్టిఫికెట్ వచ్చేలోపు ఇంటర్ వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు గడువు ముగుస్తోంది.ఆతర్వాత ఫెనాల్టీతో విద్యార్థుల ఫీజును కాలేజీలు భరించాల్సి వస్తోంది. ఉదాహరణకు ఒక కాలేజీలో 500 మంది విద్యార్థులుంటే.. ఒక్కొక్కరికి రూ. 500 చొప్పున లేట్ ఫీజు కట్టాలన్నా రూ. 2.50 లక్షలు అవుతోంది. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంటే ఇది ఇంకా ఎక్కువనే. ఇలా ఇష్టానుసారంగా అనుమతుల పేరుతో వసూళ్లు, ఫెనాల్టీలను విధించడం ద్వారా ఆర్థికంగా చితికిపోవాల్సి వస్తున్నదని కాలేజీల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్లానింగ్ పక్కా...

హైదరాబాద్, డిసెంబర్ 5, ఫ్యూచర్ సిటీలో ఏ రంగంలోనైనా సరే పెట్టుబడులు పెట్టేలా ఇన్వెస్టర్లను తెలంగాణ సర్కారు ఆకర్షిస్తోంది. వ్యూహాత్మక కార్యాచరణను అమలు చేస్తోంది. దాదాపు 3 నెలల పాటు కసరస్తు చేసిన రూపొందించిన ఫ్యూచర్ సిటీ 4.0 ఫార్ములాను ప్రపంచం ముందు ఆవిష్కరించనుంది. డిసెంబరు 8, 9 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2047కు అనేక మంది దిగ్గజాలు రానున్నారు.అనేక పరిశ్రమల అధినేతలతో పాటు ఇన్నోవేటర్లు, పాలసీ మేకర్లను తెలంగాణ సర్కారు ఒకే వేదికపైకి తీసుకురానుంది. సదస్సుకు 4,800 మందికి ఆహ్వానాలు పంపింది. చాలా మంది ప్రముఖులు సదస్సుకు వచ్చేందుకు అంగీకరించారు. 2,000 వేల మందికిపైగా అతిథులు వస్తారని సర్కారు అంచనా వేస్తోంది. కాగా, ఫ్యూచర్ సిటీలో 70 ఎకరాల విస్తీర్ణంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ నిర్మించే ఛాన్స్ ఉంది.ఈ గ్లోబల్ సమ్మిట్‌కు సినీ ప్రముఖులు కూడా రానున్నారు. సల్మాన్ ఖాన్, అజయ్ దేవగణ్ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే ఆసక్తి చూపారు. ప్రపంచ స్థాయి ఫిల్మ్ స్టూడియోలను ఏర్పాటు చేయాలని సల్మాన్ భావిస్తున్నారు.ఇప్పటికే దీనిపై సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. అజయ్ దేవగణ్ కూడా అత్యాధునిక ఫిల్మ్ స్టూడియో, ఫిల్మ్ సిటీని అభివృద్ధి చేయాలనుకుంటున్నారు. సంగీత దర్శకుడు కీరవాణి 90 నిమిషాల పాటు సంగీత కచేరి ఇవ్వనున్నారు.

గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంట్‌ను ప్రభుత్వం ఆవిష్కరిస్తుంది. సదస్సుకు గౌతమ్ అదానీ, అనంత్ అంబానీ, ఎరిక్ స్పైడర్ ఆనంద్ మహీంద్రా వంటి వారు కూడా వచ్చే అవకాశం ఉంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకుంది. భారత్‌లోనే ప్రప్రథమంగా నెట్ జీరో కార్బన్ సిటీగా ఫ్యూచర్ సిటీని రూపుదిద్దనున్నారు.

అనుమతులు మస్ట్

న్యూ ఇయర్ వేడుకలకు చాలామంది ఇప్పటి నుంచే ప్లాన్‌లు వేసుకోవడం మొదలుపెట్టారు. భారీ సెలబ్రేషన్స్ నిర్వహించుకోవాలంటే ఆ మాత్రం ప్లానింగ్ ఉండాలి. సాధారణంగా డిసెంబర్ 31న సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు వేడుకలు చేసుకుంటారు.కొన్ని చోట్ల సమయం మించిపోయినప్పటికీ సెలబ్రేషన్స్ కొనసాగుతూనే ఉంటాయి. ఇతరులకు ఇబ్బంది కలుగుతుందన్న విషయాన్ని కూడా పట్టించుకోకుండా చాలా మంది నానా హంగామా చేస్తారు. డీజే సౌండ్స్‌తో హోరెత్తిస్తుంటారు.మద్యం తాగి కేకలు వేస్తూ వింత జీవుల్లా ప్రవర్తిస్తారు. ఇటువంటి వారిని అదుపుచేసేందుకు పోలీసులు ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తుంటారు. న్యూ ఇయర్ సెలబ్రేట్ చేసుకోవాలనుకుంటే పర్మిషన్ తీసుకోవాల్సిందేనని పోలీసులు మళ్లీ చెప్పారు. డిసెంబర్ 31న నిర్వహించే సెలబ్రేషన్స్‌కు ముందస్తు అనుమతులు తప్పనిసరని సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి తెలిపారు.ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీల నిర్వాహకులు ఈ నెల 21 లోపు ఇ.ఎ.ఎజూఎబ.బివశ్రీజీనిణజీనిజీ.ఐనీల.తినిలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ సమయం తర్వాత వచ్చే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోరు. టికెట్ ఈవెంట్లకు కమర్షియల్/టికెటెడ్ ఫామ్ ఆప్షన్ ఉంటుంది.కాగా, న్యూ ఇయర్ హోటళ్లు, పబ్బులు, ఈవెంట్ల నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలను కూడా పోలీసులు విడుదల చేయనున్నారు. ఇక న్యూఇయర్ పేరుతో డ్రగ్స్ తీసుకుంటే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారు.

# ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పేలా! రామగుండం అభివృద్ధి చేస్తా!

24తగ్గేదే లేదు.
గడీల పాలన కూలగొట్టి ప్రజా పాలన మొదలుపెట్టాం. ఎమ్మెల్యే ఏం ఎస్ రాజ్ ఠాకూర్.
రామగుండంలో 800 మెగావాట్ల పవర్ ప్లాంట్.500 మెగావాట్ల పంప్డ స్టోరేజ్ ప్లాంట్ ఏర్పాటు.
1000కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి చేశాం.
అంతర్గాం మండలంలో 977 ఎకరాలలో ఎయిర్పోర్ట్.450 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులను త్వరలో చేపడుతున్నాము.
రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్....



**రామగుండం నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి:** గోదావరిఖని : రామగుండం నియోజకవర్గం లో ప్రతిపక్షాలకు పార్టీలకు బుద్ధి చెప్పే విధంగా రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా, అభివృద్ధి విషయంలో తగ్గేదే లేదని,తెలంగాణ రాష్ట్రంలో గడీల పాలన కూలగొట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన మొదలుపెట్టామని రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ స్పష్టం చేశారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో గురువారం రాత్రి కాంగ్రెస్ నాయకులు, అభిమానులు నిర్వహించిన అభినందన సభలో రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ అధికారం చేత పట్టి రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఈ ప్రాంతాన్ని ఇప్పటికే 1000 కోట్లతో అభివృద్ధి చేశామని గర్వంగా చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా 800 మెగావాట్ల పవర్ ప్లాంట్, 500 మెగావాట్ల పంప్డ స్టోరేజ్ ప్లాంట్లకు రాష్ట్రం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిందన్నారు. ఇదే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆలోచన విధానంతో 1000 కోట్లతో అభివృద్ధి సాధించామన్నారు. అస్తమానం నిందలు వేసే బిఆర్ఎస్ పార్టీ 8 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్ర ప్రజలను నట్టేట ముంచిందన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన విధానంతో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధి సాధిస్తున్నామన్నారు. కమిషన్ లకు కక్కుర్తి పడే బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇక్కడ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామంటే నిందలు వేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వనరులు లేని యాదాద్రిలో పవర్ ప్లాంట్ పెట్టి కమిషన్లు దండుకున్నారన్నారు. రామగుండం నియోజకవర్గంలో ఎల్లంపల్లి ప్రాజెక్టును కట్టిన దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఇక్కడి రైతులకు మూడు పంటలకు సాగునీటితో పాటు తాగునీరు అందించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కట్టించిన మేడిగడ్డ, కాళేశ్వరం, సుందిళ్ల , అన్నారం ప్రాజెక్టులు పంటల సాగుకు పనికిరాకుండా పోయాయని అన్నారు. పాలకుర్తిలో 450 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు త్వరలో చేపడతామన్నారు. బడుగు బలహీన వర్గాలకు నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళను ఇచ్చేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఇదే క్రమంలో ఇక్కడున్న ట్రాన్స్ జెండర్స్ కు 5 లక్షలు ఇచ్చి ఇల్లు కట్టిస్తామన్నారు. సోషల్ మీడియా ద్వారా నన్ను నా కుటుంబాన్ని పార్టీ శ్రేణులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. వారికి ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు. ఏది ఏమైనా ఈ ప్రాంత అభివృద్ధే తన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు ప్రజలు వ్యాపారస్తులు వివిధ సంఘాల నాయకులు కుల సంఘ నాయకులు తదితరులు ఉన్నారు

# బార్ అసోసియేషన్ అధ్యక్షుడినిగా లకిడి భాస్కర్ - మద్దతు తెలిపిన న్యాయ వాదులు




**ప్రజాబలం ప్రతినిధి:** పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లకిడి భాస్కర్‌ను తొలగిస్తూ కొందరు కార్యవర్గ సభ్యులు, ప్రధాన కార్యదర్శి కలిసి చేపట్టిన అవిశ్వాస తీర్మానం, సస్పెన్షన్ చెల్లదని బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా తానేనంటూ లకిడి భాస్కర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఇది బై లాకు పూర్తి విరుద్ధమన్నారు. జిల్లా కోర్టు స్థల కేటాయింపు వివాదాన్ని అడ్డుపెట్టుకుని కొందరు సీనియర్ సభ్యులు తనపై రాజకీయ కుట్ర పన్నుతున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఆయన వెంట పలువురు సినియర్ న్యాయవాదులు జిల్లా కోర్టు వద్ద సీనియర్ సభ్యులు దోనేటి కిష్టయ్య, కోశాధికారి గౌరిశెట్టి సత్యనారాయణ, లైబ్రరీ సెక్రెటరీ పుట్ట రవితోపాటు పలువురు మద్దతుగా నిలిచారు. కాగా జిల్లా కోర్టు భవనం కోసం కన్నాల వద్ద స్థలం కేటాయింపును గతంలో వ్యతిరేకించామని, పెద్దపల్లిలో స్థలం దొరకకపోవడంతోనే ప్రభుత్వం రాఘవపూర్ వద్ద 10 ఎకరాలు కేటాయించింద న్నారు. ఇది 114 మంది సభ్యుల సంతకాలతో 2023 లోనే ఆమోదించబడిందని వివరించారు. ఈ వివాదం కారణంగా కోర్టు భవనం కోసం మంజూరైన రూ.81 కోట్ల నిధులు వెనక్కిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తన వరుస విజయాలను జీర్ణించుకోలేని కొందరు, తాను బలహీన వర్గాల నుంచి వచ్చాననే ఏకైక కారణంతో అణగదొక్కాలని చూస్తున్నారని, తనపై అవిశ్వాసం పెట్టడం బై లాలో లేదని, తాను మార్చి 31 వరకు అధ్యక్షుడిగా ఉంటానని తేల్చిచెప్పారు. ఈ అక్రమ చర్యకు పాల్పడిన వారిపై హైకోర్టులో లీగల్ చర్యలు తీసుకుంటానని,ఇప్పటికే బార్ కౌన్సిల్‌కు, డీజేకు ఫిర్యాదు చేశానని ఆయన వివరించారు. అనంతరం సీనియర్ సభ్యులు దోనేటి కిష్టయ్య, గౌరిశెట్టి సత్యనారాయణ, పుట్ట రవి తదితరులు మాట్లాడుతూ కార్యవర్గ సభ్యులు తీసుకున్న సస్పెన్షన్ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని, అడ్వకేట్ యాక్ట్‌కు వ్యతిరేకమన్నారు. అధ్యక్షుడిని సస్పెండ్ చేయడం, సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం కార్యవర్గానికి లేదని స్పష్టం చేశారు. కొత్త కోర్టు కాంప్లెక్స్ కోసం రాఘవపూర్‌ను ఎంచుకున్న నిర్ణయం హైకోర్టు మార్గదర్శ కాలకు అనుగుణంగా తీసుకున్న మంచి నిర్ణయమని, ఈ తీర్మానంపై ప్రస్తుతానికి వ్యతిరేకిస్తున్న సభ్యులు కూడా గతంలో సంతకాలు చేశారని తెలిపారు.ఈ చర్యలన్నీ అధ్యక్షుడిని లక్ష్యంగా చేసుకుని చేస్తున్నారని, పెద్దపల్లి బార్ అసోసియేషన్ చరిత్రలో అధ్యక్షుడిని ఈ విధంగా తొలగించడం ఇదే తొలిసారి అని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన లకిడి భాస్కర్ అతని కాల పరిమితి వరకు కొనసాగు తారని, అప్పటివరకు తొలగించే హక్కు లేదని తేల్చి చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి చట్ట విరుద్ధ చర్యలు చేపడితే తాము చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. ఈ సమావేశంలో కొండ బత్తుల ఆంజనేయులు, ప్రసాద్ రావు, సొల్లురి మల్లేశం, డివిఎస్ మూర్తి, అమిర్ శెట్టి కృష్ణ, రాజు కార్తీక్,రాజేందర్, బండారి రమేష్, కుంభం సంతోష్, ప్రవీణ్ రావు, రఘువీర్,గడ్డి సదానందం, రాచూరి శ్రీకాంత్, వంశీకృష్ణ తదితరులు పాల్గొని

# వేలం డబ్బు పంపకంలో వివాదం కల్హేర్ మండలం ఫత్తేపూర్లో ఘర్షణ పోలీసులు రంగ ప్రవేశం

సంగారెడ్డి సర్పంచ్ పదవికి వేలం పాట ద్వారా వచ్చిన డబ్బు పంపకం విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం ఫత్తేపూర్ గ్రామంలో చోటుచేసుకుంది.

వాయిస్: ఫత్తేపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి ఎస్సీ జనరలు రిజర్వ్ అయింది. నాలుగు రోజుల క్రితం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు వేలం పాట నిర్వహించినట్లు తెలిసింది. బీఆర్ఎస్ మద్దతు ఉన్న నాందారి నవీన్, కాంగ్రెస్ తరఫున రాసాలం స్వామిదాస్ పాల్గొన్నారు. వేలం పాటలో నాందారి నవీన్ రూ.9.50 లక్షలకు పలికి, సర్పంచ్ పదవిని దక్కించుకున్నట్లు సమాచారం. ఈ డబ్బులు ఇప్పటికే చెల్లించినట్లు కూడా తెలిసింది. అయితే, వేలం పాట ద్వారా వచ్చిన ఈ మొత్తాన్ని ఒక కులానికి చెందిన ఆలయ నిర్మాణం కోసం మాత్రమే ఖర్చు చేయడానికి గ్రామ పెద్దలు నిర్ణయించడంతో వివాదం మొదలైంది. దీనిపై ఆగ్రహించిన గ్రామంలోని ఇతర కులాలకు చెందిన వారు, తమకు ఆ డబ్బుల్లో వాటా ఇవ్వకుంటే తాము వేరే అభ్యర్థిని ఎన్నికల బరిలో నిలబెడతామని బుధవారం రాత్రి ఒక సభ ఏర్పాటు చేసుకుని చర్చించారు. ఈ విషయం తెలిసిన వేలం పాట ద్వారా అభ్యర్థిని ఎంపిక చేసిన వర్గం వారు అభ్యంతరం చెప్పడంతో, ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. సమాచారం అందుకున్న కల్హేర్ ఎస్సై రవిగౌడ్ వెంటనే ఫత్తేపూర్ గ్రామానికి చేరుకుని, అందరినీ చెదరగొట్టారు. ఇదిలా ఉండగా, వేలం పాట ద్వారా ఎన్నికైన నవీన్ ఒక కులానికి చెందిన ఓట్ల మద్దతుతో ఒకవైపు ఎన్నికల బరిలో ఉంటుండగా, గ్రామంలోని ఇతర కులాల తరఫున మరో అభ్యర్థిని పోటీకి దించినట్లు గ్రామస్థులు తెలిపారు.

# రక్షణ శాఖ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు ఉక్కుపాదం మోపిన అధికారులు

సికింద్రాబాద్.. రక్షణ శాఖ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై కంటోన్మెంట్ అధికారులు ఉక్కు పాదం మోపారు. బాంటియా గార్డెన్ బంగ్లా నెంబర్ 207లో అక్రమ వ్యాపార సముదాయాలు కొనసాగుతున్న భవనం పై కొరడా జులుపించారు. గత కొంతకాలంగా ఈ భవనంలో సెల్ ఫోన్ విడిభాగాల గల సంబంధించి గోదాం నిర్వహిస్తున్న తరుణంలో ఇప్పటికే కంటోన్మెంట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు కూల్చివేతలు చేపట్టినట్లు కంటోన్మెంట్ అధికారులు స్పష్టం చేశారు. రక్షణశాఖ స్థలాలలో అక్రమంగా భవనాలు నిర్మించినా, వ్యాపారాలు కొనసాగించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కూల్చివేతల నేపథ్యంలో కంటోన్మెంట్ సిబ్బంది అందరూ ఉన్న సామాగ్రిని బయటకు తరలించారు. కూల్చివేతలలో కంటోన్మెంట్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఉమాశంకర్, ఫణి కుమార్, జిష్ణు, దినేష్, రాజేశ్వరరావు, హెల్త్ విభాగం సూపర్డెంట్ దేవేందర్ పాల్గొన్నారు

# కరీంనగర్ జిల్లాలో బిటెక్ విద్యార్థి ఆత్మహత్య... ఆత్మహత్యకు చదువులో వెనుకబాటే కారణమని స్పష్టం చేసిన పేరెంట్స్

కరీంనగర్ హుజూరాబాద్ మండలం సిరసపల్లి లో బిటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి ఆత్మహత్య కలకలం సృష్టించింది. సిర్సపల్లి గ్రామానికి చెందిన రమేష్ - రజిత కు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు అభినయ సుధన్ హుజూరాబాద్ మండలం సింగపూర్ కిట్స్ కళాశాలలో బి టెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. అయితే ఉదయం బాత్రూం లో వెళ్ళి ఉరి వేసుకున్న విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు అభినయ్ ను హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. అయితే చదువులో వెనుకబాటుతనమే ఆత్మహత్య కు కారణమని మృతుని తండ్రి ఫిర్యాదు చేయగా సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు విచారణ చేపట్టారు.

# పంచాయతీ ఎన్నికల్లో మంత్రి శ్రీధర్ బాబు బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

-గ్రామాల సంపూర్ణ అభివృద్ధికి దోహదపడండి
-కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ



**ప్రజాబలం ప్రతినిధి:** మంథని నియోజకవర్గంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు లు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జీ ప్రజలను కోరారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల సమగ్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రాంతాల్లో సక్రమంగా అమలు చేయుటకు నీతి నిజాయితీ గల అభ్యర్థులను ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయుటకు కావలసిన నిధులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఒప్పించి పెద్ద ఎత్తున సమకూరుస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించి మీ మీ గ్రామాల సంపూర్ణ అభివృద్ధికి దోహదం చేసుకునేందుకు సహకరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీసీ సెల్ నాయకులు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు, కాంగ్రెస్ మద్దతిస్తున్న అభ్యర్థుల వ్యతిరేకంగా పనిచేసే కాంగ్రెస్ నాయకులపై పార్టీ పరంగా చర్యలు ఉంటాయని బీసీ సెల్ నాయకుడు గోటికార్ కిషన్ జీ తెలిపారు.

# సాయి ఈశ్వర్ ను పరామర్శించిన నేతలు

సికింద్రాబాద్.. బిసి రిజర్వేషన్ ల కోసం ఆత్మహత్యకు యత్నించి గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయి ఈశ్వర్ ని మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘం నాయకుడు జాజుల శ్రీనివాస్ పరామర్శించారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతని ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సగం జనాభా ఉన్న బీసీలకు అన్యాయం చేస్తే ప్రభుత్వాలు మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. బీసీల ఓట్లతో గెలిచిన నాయకులు బీసీలను విస్మరించి బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడితే సహించేది లేదని అన్నారు. బీసీ ఉద్యమం నేపథ్యంలో యువకులు మనోవేదనకు గురై ఆత్మహత్యలు చేసుకోవద్దని కోరారు.. బీసీల బిక్షతోనే ప్రభుత్వాలు మనుగడ సాగిస్తున్న విషయాన్ని మరిచిపోవద్దని అన్నారు. బీసీలంతా ఐక్యతతో బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడే ప్రభుత్వం మెడలు వంచి సాధించాలని సూచించారు. బీసీలంతా ఒక్కటై పోరాడితే రాష్ట్రము అగ్నిగుండంగా మారుతుందని హెచ్చరించారు. వెంటనే సాయి ఈశ్వర్ కుటుంబానికి 50 లక్షల రూపాయల తక్షణ సహాయాన్ని ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేశారు. జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ అగ్రకులాల పాలనను వదిలిపెట్టే సమస్య లేదని అన్నారు. ఇప్పటికే బీసీ బిడ్డలు ఆత్మహత్యలు చేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. బీసీలంతా ఒకటై పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు.

# అణగారిన వర్గాల హక్కులు, అభ్యున్నతి కోసం పోరాడిన యోధుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్

## -నేడు ఆయన వర్ధంతి



అణగారిన వర్గాల హక్కులు, అభ్యున్నతి కోసం పోరాడిన యోధుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్.ఆయన భీంరావ్ రాంజీ అంబేద్కర్ "బాబాసాహెబ్" అని ప్రసిద్ధి పొందారు. ధర్మశాస్త్రపండితుడిగా, భారత రాజ్యాంగ నిర్మాతగా, రాజకీయ నాయకునిగా, స్వంతంత్ర భారత తొలి న్యాయ శాఖా మంత్రి గా, స్వాతంత్ర్యోద్యమ దళిత నాయకునిగా, వృత్తి రీత్యా న్యాయవాదిగా,అణగారిన వర్గాల హక్కులు, అభ్యున్నతి కోసం పోరాడిన యోధునిగా భారతదేశానికి సేవాలందిచారు అంబెడ్కర్. భీంరావ్ రాంజీ అంబేద్కర్ 1891 సంవత్సరం ఏప్రిల్ 14 నాడు అప్పటి సెంట్రల్ ప్రావిన్సెస్ లో సైనిక స్థావరమైన మహోం అను ఊరిలో (ఇప్పటి మధ్యప్రదేశ్ లో) రాంజీ మలోజీ సాక్పాల్ మరియు భీమాబాయ్ దంపతుల 14 వ మరియు చివరి సంతానంగా జన్మించాడు. అతని కుటుంబం ఆధునిక మహారాష్ట్ర లోని రత్నగిరి జిల్లాలో అంబావడే పట్టణం (మందనగడ్ తాలూకాలో) వారు కావున మరాఠీ నేపథ్యం కలవారు. వీరు మహర్ కులానికి చెందినవారు కావున అంటరానివారిగా సామాజిక మరియు ఆర్థికఇబ్బందులకు గురి అయ్యారు. బ్రిటీష్ ఈస్ట్ భారతదేశం కంపెనీ యొక్క సైన్యం లో అంబేద్కర్ పూర్వీకులు పనిచేశారు. వీరి తండ్రి భారత సేవలు మోహో సైనిక స్థావరంలో బ్రిటీష్ సైన్యంలో పనిచేశాడు. .బాల్యంలోనే అడుగడుగునా బాధలకు, అవమానాలకు గురియై, బీదరికాన్ని ఎదుర్కొంటూ స్వయంకృషితో, స్వీయప్రతిభతో స్వతంత్ర భారతదేశంలో కేంద్రమంత్రి పదవిని అలంకరించిన మహామనీషి శ్రీ బాబాసాహెబ్ అంబేద్కర్. లోకమాన్య బాలగంగాధర తిలక్, మహర్షి కార్వే వంటి అగ్రనాయకులు జన్మించిన మహారాష్ట్రంలోని రత్నగిరి జిల్లాలో, మందన్‌గాడ్ పట్టణానికి దగ్గరున్న అంబావాడే గ్రామంలో మెహర్ కులానికి చెందిన, రాంజీ సక్‌పాల్, భీమాబాయి దంపతుల 14వ సంతానంగా జన్మించిన వాడు అంబేద్కర్. భీమ్‌రావ్ ను తండ్రి చాలా క్రమశిక్షణతో పెంచాడు. బాల భీమ్‌రావ్ ప్రతిదినం రామాయణ, భారత, తుకారం, మోరోపంత్ ల భజన గీతాలు గానం చేసేవారు. ఆ కుటుంబం శాకాహారం మాత్రమే సేవించేది. మెహర్లను అస్పృశ్యులుగా పరిగణించిన కాలమది. వేసవిసెలవుల్లో మామగారున్న గోరెగావ్ కు భీమ్‌రావ్, అన్న, మేనల్లుళ్ళతో పాటు వెళ్ళాడు. అనుకున్నట్లు, మామ స్టేషన్‌కు రాలేకపోయారు. స్టేషన్ నుండి, గ్రామానికి వెళ్ళటానికి బండిని కుదుర్చుకున్నారు. కొంత దూరం వెళ్లిన తర్వాత బండివాడికి, వీళ్ళు మెహర్ కులస్థులని తెలిసింది. అందరినీ బండి నుండి దిగమన్నాడు. ఎండాకాలం. పిల్లలు ఆ బండివాణ్ణి బతిమాలు కొన్నారు. రెండింతలు బాడుగ ఇస్తామన్నారు. భీమ్‌రావ్ అన్న బండి తోలేటట్లు, బండివాడు నడచి వచ్చేటట్లు మాట్లాడుకున్నారు. ఆకలి దప్పులతో అలమటిస్తూ అర్ధరాత్రికి గోరేగావ్ చేరారు పిల్లలు. వీధికుళాయి నీరు తాగుతూ వున్న భీమ్‌రావ్ ను కొట్టి మంచినీరు త్రాగకుండా గెంటివేశారు. కులంపేర భీమ్‌రావ్ ను అవమానాలకు గురిచేశారు. రామ్‌జీ, సతారా వదలి పిల్లల చదువుకోసం బొంబాయి చేరారు. భీమ్‌రావ్ ఎల్‌ఫిన్‌స్టన్ హైస్కూల్ లో చేరి మెట్రిక్యులేషన్ పాసయ్యారు. సంస్కృతం చదువు కోవాలని ఆశించారు. కులం అడ్డు వచ్చింది. ఇష్టంలేకున్నా పర్షియన్ భాష చదివారు. 16వ ఏటనే పెద్దలు అతనికి పెళ్ళి చేశారు. బరోడా మహారాజు శాయాజీరావ్ గైక్వాడ్ ఇచ్చిన 25 రూపాయల విద్యార్థి వేతనంతో 1912లో బి.ఏ. పరీక్షల్లో నెగ్గారు. పట్టభద్రుడైన వెంటనే బరోడా సంస్థానంలో ఉద్యోగం లభించింది. కాని పై చదువులు చదవాలన్న పట్టుదలవల్ల ఉద్యోగంలో చేరలేదు. మహారాజుకు తన కోరికను తెలిపారు. విదేశంలో చదువుపూర్తిచేసిన తరువాత బరోడా సంస్థానంలో పదేళ్లు పనిచేసే షరతుపై 1913లో రాజాగారి ఆర్థిక సహాయం అందుకొని కొలంబియా విశ్వవిద్యాలయం చేరారు. 1915లో ఎం.ఏ. 1916లో పి.హెచ్.డి. డిగ్రీలను సంపాదించారు. ఆనాటి సిద్ధాంత వ్యాసమే పదేళ్ల తర్వాత "ది ఎవల్యూషన్ ఆఫ్ ప్రొవిన్షియల్ ఫైనాన్సస్ ఇన్ ఇండియా" అను పేరుతో ప్రచురించబడినది. 1917 లో డాక్టర్ అంబేద్కర్‌గా స్వదేశం వచ్చారు. అప్పటికాతని వయస్సు 27 ఏళ్లు. అస్పృశ్యుడొకడు అంతగొప్ప పేరు సంపాదించుకోవటం ఆనాటి అగ్రవర్ణాలవారికి ఆశ్చర్యం కల్గించింది. మహారాజాగారి మిలిటరీ కార్యదర్శి అయ్యాడు. కాని ఆఫీసులో నౌకర్లు కాగితాలు ఆయన బల్లపై ఎత్తివేసేవారు! కొల్హాపూర్ మహారాజు సాహూ మహరాజ్ అస్పృశ్యతా నివారణకెంతో కృషి చేస్తుండేవాడు. మహారాజా సహాయంతో అంబేద్కర్ 'మూక నాయక్' అనే పక్షపత్రిక సంపాదకత్వం వహించారు. 32 సంవత్సరాల వయసులో డా.అంబేద్కర్, బార్-అట్-లా, కొలంబియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి. లండన్ విశ్వవిద్యాలయం నుండి డి.ఎస్.సి పట్టాలను పొందాడు. కాని ఆఫీసు జవానులు కూడా ఈయనను అస్పృశ్యుడుగా చూచారు. 1927లో మహద్‌లో దళిత జాతుల మహాసభ జరిగింది. మహారాష్ట్ర గుజరాత్‌ల నుండి కొన్ని వేలమంది వచ్చారు. మహద్ చెరువులోని నీటిని త్రాగుటకు వీలు లేకుండ ఉండేది,అంటరానివారికి ఆ చెరువులో ప్రవేశం లేదు. అంబేద్కర్ నాయకత్వంలో వేలాదిమంది చెరువు నీరు స్వీకరించారు. ఈ సంఘటన మహారాష్ట్రంలో సంచలనం కలిగించింది. 1927లో అంబేద్కర్ 'బహిష్కృత భారతి' అనే మరాఠి పక్ష పత్రిక ప్రారంభించారు. ఆ పత్రికలో ఒక వ్యాసం వ్రాస్తూ అంబేద్కర్ ఇలా అన్నాడు: తిలక్ గనుక అంటరానివాడుగ పుట్టివుంటే 'స్వరాజ్యం నా జన్మ హక్కు'అని ఉండడు. ' అస్పృశ్యతా నివారణే నా ధ్యేయం, నా జన్మ హక్కు' అని ప్రకటించి ఉండేవాడని వ్రాశారు. అంటే ఆనాడు అంబేద్కర్ కులతత్వవాదుల బాధను ఎంతగా అనుభవించాడో తెలుస్తుంది. 1927లో ఛత్రపతి శివాజీ త్రిశతి జయంతి ఉత్సవాలు మహారాష్ట్ర అంతటా గొప్పగా జరిగాయి. అంబేద్కర్ ను సాదరంగా ఆహ్వానించాడు కొలాబాలోని ఉత్సవ సంఘాధ్యక్షుడైన బ్రాహ్మణుడైన పలాయ శాస్త్రి. ఆ ఉత్సవాలలో ప్రసంగిస్తూ అంబేద్కర్ పీష్వాల సామ్రాజ్య పతనానికి ముఖ్యకారణం అస్పృశ్యతను పాటించడమే అన్నారు. 1927 డిసెంబర్ 25న అంబేద్కర్ 'మనుస్మృతి'ని బహిరంగంగా కాల్చటం మరో సంచలనం కల్గించింది. ఆ విషయంగా మాట్లాడుతూ సవర్ణ హిందువుల దృష్టిని బలవంతాన ఆకర్షించడానికి అపుడపుడు అలాంటి తీవ్ర చర్యలు అవసరమవుతాయన్నారు. అంతేకాదు, మనుస్మృతి లోని అన్ని భాగాలు నిందనీయాలు కావు అన్నారు. 1931లో రెండవ రౌండ్ టేబిల్ సమావేశ సన్నాహాల సందర్భంగా అంబేద్కర్ గాంధీజీని కలుసుకున్నారు. "ఏ దేశంలో లేదా ఏ మతంలో తమను కుక్కలకన్నా, పిల్లులకన్నా హీనంగా చూస్తున్నారో అదేశాన్ని గురించి తానే విధంగాను భావించలేను అంటూ గాంధీజీ, 'ఐ హేవ్ నో హోమ్ ల్యాండ్'"అని చాటి చెప్పారు. ఆ తర్వాత రౌండుటేబుల్ సమావేశాలకు లండన్ వెళ్లారు. 1932లో బ్రిటీష్ ప్రభుత్వం కమ్యూనల్ అవార్డును ప్రకటించింది. దాని ప్రకారం అస్పృశ్యులకు ప్రత్యేక స్థానాలు లభించాయి. ఎరవాడ జైలులో వున్న గాంధీజీ నిరాహారదీక్ష ప్రారంభించారు. "మహాత్ములు వస్తుంటారు. పోతుంటారు. అంటరాని వారు మాత్రం అంటరాని వారుగానే వుంటున్నారు." అన్నాడు అంబేద్కర్. కొన్ని సంవత్సరాలు అస్పృశ్యతా నివారణ కోసం దళిత జాతుల హక్కుల కోసం పోరాటం సాగించాడు. భారతదేశానికి స్వాతంత్ర్యం రావటం, రాజ్యాంగ పరిషత్తు సభ్యుడుగ అంబేద్కర్ విశేష శ్రమవహించి రాజ్యాంగం రచించటం ఆయన శేష జీవితంలో ప్రముఖమైన ఘట్టం. టి.టి కృష్ణమాచారి (కేంద్రమంత్రి) ఒకమారు రాజ్యాంగ పరిషత్తులో మాట్లాడుతూ 'రాజ్యాంగ రచనా సంఘంలో నియమింపబడిన ఏడుగురిలో ఒకరు రాజీనామా చేశారు. మరొకరు మరణించారు. వేరొకరు అమెరికాలో వుండి పోయారు. ఇంకొకరు రాష్ట్ర రాజకీయాలలో నిమగ్నులయ్యారు. ఉన్న ఒక్కరిద్దరు ఢిల్లీకి దూరంగా ఉన్నారు. అందువల్ల భారత రాజ్యాంగ రచనా భారమంతా డా.అంబేద్కర్ మోయవలసి వచ్చింది. రాజ్యాంగ రచన అత్యంత ప్రామాణికంగా వుంటుందనటంలో ఏలాంటి సందేహం లేదు, అన్నారు. అంబేద్కర్ తన 56 ఏట సారస్వత బ్రాహ్మణ కుటుంబానికి చెందిన కుమారి శారదా కబీర్ ను పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్య 1935లో మరణించింది. కేంద్ర మంత్రి మండలిలో న్యాయశాఖ మంత్రిగా వుండి 1951 అక్టోబర్ లో మంత్రి పదవికి రాజీనామా చేశారు. 1956 అక్టోబర్ 14న నాగ్ పూర్ లో అంబేద్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించారు. గాంధీజీతో అనేక విషయాలలో భేదించినా తాను మతం మారదలచుకున్నప్పుడు మాత్రం దేశానికి చాలా తక్కువ ప్రమాదకరం అయినదానినే ఎన్నుకుంటానని, బౌద్ధం భారతీయ సంస్కృతిలో భాగమని, ఈ దేశ చరిత్ర సంస్కృతులు, తన మార్పిడివల్ల దెబ్బతినకుండా చూచానన్నారు. హిందువుగా పుట్టిన అంబేద్కర్ హిందువుగా మరణించలేదు. నిరంతర కృషితో సాగిన ఆయన జీవితం ఉద్యమాలకు వూపిరిపోసింది. ముఖ్యంగా సాంఘిక సంస్కరణలకు. అంబేద్కర్ పెక్కు గ్రంథాలు వ్రాశాడు. ' 'ది ప్రాబ్లం ఆఫ్ ది రూపీ', 'ప్రొవిన్షియల్ డీ సెంట్రలైజేషన్ ఆఫ్ ఇంపీరియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటీష్ ఇండియా', 'ది బుద్ధా అండ్ కార్ల్ మార్క్స్', 'ది బుద్ధా అండ్ హిజ్ ధర్మ' ప్రధానమైనవి. ప్రసిద్ధ రచయిత బెవెర్లి నికొలస్ డాక్టర్ అంబేద్కర్ భారతదేశపు ఆరుగురు మేధావులలో ఒకరు అని ప్రశంసించాడు. మహామేధావిగా, సంఘసంస్కర్తగా, న్యాయశాస్త్రవేత్తగా, కీర్తిగాంచిన డాక్టర్ భీమారావ్ అంబేద్కర్ 1956 డిసెంబర్ 6 న కన్ను మూశారు. 1988లో విపి సింగ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భారతదేశంలో నిజమైన రత్నం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని గుర్తించి ఆయనకు మరణాంతరం భారతరత్న అవార్డు ప్రకటించి గౌరవించింది.

## ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష

### - రూ.6లక్షల జరిమానా

### తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి



తిరుపతి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం (ఖీూయాఈ) కఠిన చర్యలు అమలు చేస్తోంది.

గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి పోలీసులు ప్రత్యేక శ్రద్ద తీసుకున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 12/2016 కేసులో ఈ ముద్దాయి తిరుపతి జిల్లా తిరుమల, తుంబురు తీర్థం పరిధిలో అరెస్టయ్యాడు. ఈ వ్యక్తి తమిళనాడు, వేలూరు జిల్లా కు చెందిన పలని లక్ష్మణన్ , కాగా ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 6లక్షల జరిమానా విధిస్తూ నిందితుడని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

## సాయి ఈశ్వర్ కు 50 లక్షలు ఆర్థిక సహాయం అందించాలి

### మాజీమంత్రి తలసాని

సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న సాయి ఈశ్వర్ ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. సాయి ఈశ్వర్ కుటుంబానికి 50 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేసారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ ప్రభుత్వం మోసం చేసింది. అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలకు కాంగ్రెస్ పార్టీ పాల్పడుతోందని అన్నారు.బిసి బిడ్డలు ఆవేశాలకు గురై బలవన్మరణాలకు పాల్పడవద్దని కోరారు. అధికార పార్టీ నేతల దౌర్జన్యాలకు నిర్మల్ జిల్లాలో సర్పంచ్ అభ్యర్థి భర్త రవీందర్ ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా లో సర్పంచ్ అభ్యర్థి భర్తను కిడ్నాప్ చేసి మూత్రం తాగిస్తారా? ముఖ్యమంత్రి నియోజకవర్గ పరిధిలో 28 కి 25 గ్రామపంచాయితీలు ఏకగ్రీవం ఎలా అయ్యాయని అన్నారు. జనాభా లో సగభాగం ఉన్న బిసి లు ఏకమై గద్దె దింపుతామని హెచ్చరించారు.

## నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన మైండ్ స్పార్క్ సాఫ్ట్వేర్ కంపెనీ

మాదాపూర్ లో మరో కంపేనీ దుకాణం ఎత్తేసింది. మెడికల్ కోడింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ లక్షలు వసూలు చేసిన మైండ్స్ పార్క్ సంస్థ మూతపడింది. మెంటర్ శ్రీకాంత్ జోషి నిరుద్యోగుల దగ్గర నుంచి లక్షల్లో డబ్బులు వసూలు చేసి రాత్రికి రాత్రి రే పరారైయాడు. ఒక్కొక్క నిరుద్యోగ దగ్గర నుంచి సుమారు లక్ష నుంచి 2 లక్షలు వసూలు చేసారు. సుమారు 80 నుంచి 100 మంది బాధితులు వున్నారు. శ్రీకాంత్ జోషితోపాటు దిలీప్ శివారెడ్డి పైన కూడా బాధితులు ఫిర్యాదు చేసారు. ఈ నేపద్యంలో బాధితులు మాదాపూర్ లోని క్యాపిటల్ పార్క్ దగ్గర నిరుద్యోగ బాధితులు ఆందోళన కు దిగారు.

## భామిని మోడల్ స్కూల్ లో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్

### పాల్గోన్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్




మన్యం పార్వతిపురం భామినిలోని ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. విద్యార్థుల కోసం పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, క్రీడా ప్రాంగణం గురించి అడిగి తెలుసుకున్ఆరు. వివిధ క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులను ఉత్సాహపరిచారు. తరువాత స్టెమ్ ల్యాబ్ పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ లో సీఎంకు విద్యార్థినుల ప్రజెంటేషన్ ఇచచారు. ల్యాబ్ లో విద్యార్థినుల ప్రజెంటేషన్ ఇచ్చిన తీరును సీఎం అభినందించారు.

అక్కడ జరిగిన పేరెంట్ టీచర్ మీటింగ్ లో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ పాల్గోన్నారు.



పేరెంట్స్ ఏం చదువుకున్నారని సీఎం అడిగి తెలుసుకున్నారు. పిల్లలను బాగా చదివించండి... వాళ్లకు మీరు అందించే ఆస్తి చదువేనని చెప్పారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉందా..? లేదా...? అని అడిగి తెలుసుకున్నారు. గతానికంటే చాలా బాగుందని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి ఒకరు చెప్పాడు.

మిమ్మల్ని చూసి ఆనందంగా ఉందన్న విద్యార్థులు... తమ ప్రాంతానికి తరుచూ వస్తూ ఉండండని ముఖ్యమంత్రి విద్యార్థులు కోరారు. ఓ క్లాస్ రూంలో కూర్చొని క్లికర్ విధానాన్ని విద్యార్థులతో కలిసి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ పరిశీలించారు. రెయిన్ ఫాల్ పై వీడియో ప్రదర్శించి దాని ఆధారంగా ప్రశ్నలు వేసారు. మంచి మార్కులు వచ్చిన వారికి చప్పట్లు కొట్టించారు.




మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ సందర్భంగా స్కూల్ ప్రాంగణంలో సభలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తదితరులు పాల్గోన్నారు

## బీసీ జేఏసీ అందోళన

హిమాయత్ నగర్ బిసి రిజర్వేషన్ల కోసం ఆత్మబలిదానం చేసుకున్న సాయి ఈశ్వర్ చారి మృతిపట్ల తెలంగాణ బిసి విద్యార్థి జేఏసీ ఆందోళనకు దిగింది. హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మెన్ వేముల రామకృష్ణ మాట్లాడుతూ... 12 వందల మంది ఆత్మ బలిదానాలు చేసుకుంటే , తెలంగాణ రాష్ట్రం వచ్చిందని , ఇప్పుడు రిజర్వేషన్ల కోసం ఎంత మంది బిసిలు బలిదానాలు చేసుకుంటే ఇస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కారణంగానే సాయి ఈశ్వర్ ఆత్మ బలిదానం చేసుకున్నారని ఆరోపించారు. తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సాయి ఈశ్వర్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం తో పాటు రెండు కోట్లు నష్ట పరిహారం చెల్లించి న్యాయం చేయాలని వేముల రామకృష డిమాండ్ చేశారు.

# ఈనెల 10 నుంచి నగరం లో జాగృతి జనబాట

నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల ను తెలుసుకునేందుకు ఈనెల 10 నుంచి 14 వరకు తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జాగృతి జనం బాట ను నిర్వహిస్తున్నట్లు జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ రూప్ సింగ్ తెలిపారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్ ను ఉపాధ్యక్షులు వరలక్ష్మి, మహేందర్ ముదిరాజ్, నరేందర్ ధరణి లతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజలు ఎదుర్కొన్న సమస్యలపై స్పందించే కరువయ్యారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు జాగృతి జన బాట నిర్వహిస్తుందని చెప్పారు. 10న ఖైరతాబాద్ నుంచి ప్రారంభమయ్యే యాత్ర జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని నియోజకవర్గాలలో కొనసాగుతుందని చెప్పారు.

# స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలు

జంగారెడ్డిగూడెం పక్క రాష్ట్రాలతో పోలి స్తే మన రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలు జరుగు తుందని ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ ద్వారకాతిరుమలరావు తెలిపారు. పెరుగుతున్న ఆక్యుపెన్సి దృష్ట్యా రాష్ట్రంలో కొత్తగా 1050 నూతన ఎలక్ట్రికల్ బస్ సర్వీసులు రాబోతు న్నాయని ఆయన వెల్లడించారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోను వైస్ చైర్మన్ ద్వారకా తిరుమలరావు సందర్శించారు. డిపోలోని స్టాల్స్ ను, కార్గో కౌంటర్ ను పరిశీలించా రు. ఈ క్రమంలోనే సిబ్బందితో మాట్లాడారు.అదే విధంగా ప్రయా ణికులతో కూడా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నా రు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... మన రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం విజయవంతంగా కొన సాగుతుందన్నారు. ఈ పథకంతో ఆర్టీసీ ఆక్యుపెన్సి పెరిగిందన్నారు. గతంలో 40 శాతం మంది మహిళ లు ప్రతి రోజు ఆర్టిసి బస్సులలో ప్రయాణించే వారిని, ఇప్పుడు వారి సంఖ్య 65 శాతం చేరిందన్నారు. ఈ పథకంకు సంబంధించి ఆర్టీసీకు ప్రతి నెల రాష్ట్ర ప్రభుత్వం సుమారు 160 కోట్ల రూపాయలు చెల్లిస్తుంద న్నారు. త్వరలోనే 1050 ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయన్నారు.

పల్లె వెలుగు సర్వీస్ లో కూడా ఎలక్ట్రిక ల్ బస్సులు, ఏసీ బస్సులు వచ్చే రోజులు అతి దగ్గరలోనే ఉన్నాయ ని పేర్కొన్నారు.అదే విధంగా మహి ళల మాదిరిగానే వికలాంగులకు కూడా ఉచిత బస్ సర్వీసు అందిం చే అంశం ప్రభుత్వం దృష్టిలో ఉందని, త్వరలోనే దీనిపైన స్పష్టత రానుందని ద్వారక తిరుమలరావు పేర్కొన్నారు. తొలుత ఆయనకు ఆర్టీసీ, పోలీస్ శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు.

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పూర్తిగా ఆర్థిక సదస్సు

## రేవంత్ రెడ్డి



డిసెంబర్ 8 నుంచి భారత్ ఫ్యూచర్ సిటీలో జరగబోయే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పూర్తిగా ఆర్థిక సదస్సు అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు . రాబోయే 20 ఏళ్లలో రాష్ట్ర ఆర్థిక వృద్ధి, అభివృద్ధి ప్రణాళికలను ప్రతిబింబించే "తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్" ను ఆవిష్కరించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యమని అన్నారు.

ప్రజా భవన్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లు , వరుసగా రెండు రోజుల ప్రోగ్రాం షెడ్యూల్ గురించి అధికారులు సీఎం కు వివరించారు.



విజన్ డాక్యుమెంట్‌ను తుది రూపు ఇచ్చేందుకు సీఎం పలు సూచనలు చేశారు. భవిష్యత్ వృద్ధి ప్రణాళికలను ప్రాధాన్యంగా చేర్చాలని, ఈ పత్రాన్ని ప్రజలకు డిజిటల్‌గా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ లో ఈ గ్లోబల్ సమ్మిట్ విజయాన్ని ప్రదర్శించాలనే తన ఆలోచనను సీఎం వివరించారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులతో కలిసి రేపు గ్లోబల్ సమ్మిట్ మినిట్ టూ మినిట్ షెడ్యూల్‌ను విడుదల చేయనున్నారు.

దేశవ్యాప్తంగా విమానాల రద్దు నేపథ్యంలో, హైదరాబాద్ కు వచ్చే, వెళ్లే విమాన సౌకర్యాలపై ఎటువంటి ఇబ్బందులు రాకుండా పౌర విమానయాన మంత్రిత్వ శాఖతో సంప్రదించి తగిన చర్యలుతీసుకోవాలనిసీఎంఅధికారులను ఆదేశించారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టు మరోసారి మొట్టికాయలు

## తమ ఉత్తర్వులు ఉన్న తర్వాత కూడా బతుకమ్మకుంట పరిధిలోని కట్టడాలను ఎందుకు కూల్చివేశారు



హైదరాబాద్ డిసెంబర్ 2 హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టు మరోసారి మొట్టికాయలు వేసింది. తమ ఉత్తర్వులు ఉన్న తర్వాత కూడా బతుకమ్మకుంట పరిధిలోని కట్టడాలను ఎందుకు కూల్చివేశారని ప్రశ్నించింది.కోర్టు వివాదంలో ఉన్న బతుకమ్మకుంట పరిధిలోని స్థలం విషయంలో స్టేటస్ కో కొనసాగించాలని జారీచేసిన ఉత్తర్వులను ఉల్లంఘించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ పై ఏ సుధాకర్‌రెడ్డి దాఖలు చేసిన కోర్టు ధికరణ పిటిషన్‌పై జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావులతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం విచారణ జరిపింది. ఈ విచారణకు రంగనాథ్ వ్యక్తిగతంగా హాజరయ్యారు. ఈ పిటిషన్‌పై తొలుత అక్టోబర్ 31వ తేదీన విచారించిన హైకోర్టు.. కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరాదో నవంబర్ 27వ తేదీన వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని రంగనాథ్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయితే బాచుపల్లిలో అత్యవసర పనులు ఉన్నందున హాజరుకాలేకపోతున్నానని.. మినహాయింపు కోరుతూ రంగనాథ్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై నవంబర్ 27న విచారణ జరిపిన ధర్మాసనం రంగనాథ్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది స్వరూప్ ఊరిళ్ల వాదిస్తూ, రంగనాథ్ అధికారిక విధుల్లో పాల్గొనాల్సి ఉన్నందున విచారణకు హాజరుకాలేదని చెప్పారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. 'రంగనాథ్ కోర్టు పట్ల చూపిన దయకు అభినందనలు' అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించింది. కోర్టు తలచుకుంటే ధికరణ చర్యలు ఉంటాయని, ఇదే కోర్టు హాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిలబెట్టిస్తామని వార్నింగ్ ఇచ్చింది. కోర్టుకున్న అధికారాలను రంగనాథ్ మరచిపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ధర్మాసనం తేల్చి చెప్పింది. అలాంటి పరిస్థితులను రంగనాథ్ తెచ్చుకోవద్దని సూచించింది. డిసెంబర్ 5న జరిగే విచారణకు వ్యక్తిగతంగా రంగనాథ్ హాజరుకావాల్సిందేనని తేల్చి చెప్పింది. లేకపోతే నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తామని హెచ్చరించింది. ఈ క్రమంలో శుక్రవారం నాడు రంగనాథ్ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరయ్యారు.ఈ సందర్భంగా జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావులతో కూడిన డివిజన్ బెంచ్ విచారిస్తూ.. తమ ఉత్తర్వులు ఉన్న తర్వాత కూడా ఎందుకు కూల్చారని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ప్రశ్నించారు. దీనికి వ్యర్థాలనే తొలగించామని హైకోర్టుకి రంగనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా రంగనాథ్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది.

# బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు ప్రతిపాదన

## కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.సి. రాయలు,



తిరుపతిలో కొత్త బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుపై ప్రతిపాదనలను ఢిల్లీలోని కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి సి రైలు కార్యాలయంలో ప్రతిపాదనను సమర్పించి ప్రారంభించారు. తిరుపతిలోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.సి. రాయలు, గురువారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్లోని తన చాంబర్లో కేంద్ర రైల్వే మంత్ అశ్విని వైష్ణవ్ ను కలిసి, తిరుపతిలో ప్రధాన కార్యాలయంతో కొత్త బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు ప్రతిపాదనను సమర్పించి ప్రారంభించారు. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన మంత్రి కె. రామ్ మోహన్ నాయుడు, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్ రావు మరియు అనేక మంది కమిటీ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఈ బృందం నేతృత్వం వహించిన నరసరావుపేట ఎంపీ, టిడిపి పార్లమెంటరీ ఫ్లోర్ లీడర్ లావు కృష్ణ దేవరాయులు నేతృత్వంలో చర్చలు జరిగాయి అని ఒక ప్రకటనలో తెలిపారు.

# స్క్రబ్ టై ఫస్ వ్యాధిపై అవగాహన

సి.బెళగల్ డిసెంబర్ 5 స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలుకు దొడ్డిసచివాలయ ఏఎన్ఎం మంగమ్మ పేర్కొన్నారు. ఈ వ్యాధి గూర్చి గ్రామ ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం మంగమ్మ మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ వ్యాధి రికె టిసియా అను బ్యాక్టీరియా వలన సోకుతుందని గ్రామాలలో పశువులకు ఉండే పిడుదలు మరియు చిడుములు ద్వారా సంక్రమిస్తుందని ఈ మైట్స్ అతి చిన్నగా రెండు మిల్లీమీటర్ల పొడవుతో ఎర్రగా ఉండి ఎనిమిది కాళ్లు కలిగి ఉంటుందని ముఖ్యంగా ఎలుకలు, చుంచు ఎలుకలు, పందికొక్కులు రక్తం పీలుస్తూ పరాన జీవులుగా నివసిస్తాయి, ఈ వ్యాధి సోకిన వారికి తీవ్రమైన తలనొప్పి, జ్వరం, వంటినొప్పులు, శరీరం మీద దద్దుర్లు అలాగే చర్మంపై మైటలార్వా కొట్టిన చోట నొక్కబడినట్లున్న ఎర్రటిపండు ఏర్పడి నల్లని పెచ్చులతో కూడి ఉంటుంది. ఈ వ్యాధి మనిషి నుండి మనిషికి వ్యాపించదు.









**నాంపల్లి గాంధీభవన్ ప్రజాబలం ప్రతినిధి:**గాంధీ భవన్ లో గోషామహల్ కాంగ్రెస్ నాయకుల సమావేశం ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమీటీ అధ్యక్షులు మోత రోహిత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈకార్యక్రమంలో ఓట్ చోరీ సంతకాల సేకరణ ప్రజలకు తెలియజేయడం ఏజెండాగా జరిగినది.ఈ కార్యక్రమంలో తెలంగాణా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావ్ ,నర్మదాసింగ్, శ్రీకాంత్ యాదవ్ ,చంద్రమోహన యాదవ్ ,రోజీ ,ఇఫ్తాకార్,సయ్యద్‌యునుస్ ,షా మహమ్మద్ ఆరీఫ్, డివిజన్ అధ్యక్షులు నగర కాంగ్రెస్ నాయకులు గోషామహల్ నియోజకవర్గ సీనీయర్ నాయకులు తదితరులు పాల్గోన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మద్దతుగా మంచిర్యాల జిల్లా మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ డిసెంబర్ 05 :** మంచిర్యాల నియోజకవర్గం దండేపల్లి మండలంలో మంచిర్యాల ఎమ్మెల్యే సతీమణి,మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రచారంలో పాల్గొన్నారు.శుక్రవారం దండేపల్లి మండలంలోని కన్నెపల్లి,నంబాల, వెల్గనూర్,కాసిపేట, ద్వారక,ధర్మారావుపేట గ్రామాల్లో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల గెలుపును కోరుతు ప్రచారం నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల యొక్క గుర్తులపై ఓటు వేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని కోరిన మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు ఈ సందర్భంగా గ్రామాలాల ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమం కన్నెపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చుంచు నగేష్, పంచాయతీరాజ్ శాఖ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి,మాజీ ఎంపీటీసీ తోట మోహన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కారు దే,జోరు కాంగ్రెస్ బేజారు సర్పంచ్ అభ్యర్థి మన్నె సుధాకర్

**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి డిసెంబర్ 5( ప్రజాబలం )వికారాబాద్ జిల్లా :** మర్పల్లి/కో%శీ%షేట్ పల్లి గ్రామంలో మహిళలు ప్రచార కార్యక్రమంలో భారీగా ఎత్తున పాల్గొంటున్నట్లు తెలిపారు మహిళలతో ఇంటింటా ప్రచార కార్యక్రమంలో పాల్గొని బిఆర్ఎస్ పార్టీ ప్రజల పార్టీ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మన్నె సుధాకర్ తెలిపారు గడపగడపకు మహిళలతో ప్రచార కార్యక్రమం నిర్వహించారు పార్టీ అభ్యర్థి గ్రామానికి ఎంతో సేవ చేయాలని అభివృద్ధి చేయాలని సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కల ప్రజలు






నెరవేరుస్తారని బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మన్నె సుధాకర్ తెలిపారు రాబోయే వికారాబాద్ శాసనసభ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగడం కాయం రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వం అని గ్రామపార్టీ అధ్యక్షుడు వీరేశం మాజీ రైతు సమన్వయ అధ్యక్షులు నాయాబ్ గౌడ్,తెలిపారు అందరూ కలిసి ఒక్కసారి అవకాశం కల్పించండి గ్రామాన్ని గ్రామ ప్రజలకు కావలసిన కనీస మౌలిక సదుపాయాలు అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు అన్ని ప్రజల వద్దకే తీసుకొని వస్తాను అని తెలిపారు ప్రజలందరూ మమేకమైభారీ మెజార్టీతో గెలిపించాలని తెలిపారు .

## తండ్రి - కుమార్తెల పుట్టినరోజు శుభాకాంక్షలు

### ఆసుపత్రిలో రోగులకు పండ్లు చీరలు పంపిణీ జోగిపేట కాంగ్రెస్ పార్టీ యువ నాయకురాలు మంజుల



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి డిసెంబర్ 5 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:**తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, తన కూతురు త్రిష మణికంఠ,ల ఇద్దరి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం జోగిపేట, పట్టణ కాంగ్రెస్ పార్టీ యువ నాయకురాలు మంజుల, వారి జన్మదినోత్సవ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో,పేషెంట్లకు చీరలు, పండ్లను పంపిణీ చేశారు.తండ్రి కూతుళ్ళ పుట్టినరోజు వేడుక సందర్భంగా వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని,ఆ భగవంతుడి ఆశీస్సులు ఉండాలని కోరుతున్నాం అన్నారు,కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దిరి రెండు సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో భాగంగా ప్రభుత్వం అభివృద్ధి దిశగా ఎన్నో పథకాలతో ముందుకు తీసుకెళ్తుందన్నారు....



## పురుషుల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ప్రారంభించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి డిసెంబర్ 05 (ప్రజాబలం )సంగారెడ్డిజిల్లా:**రష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యా,ఆదేశం మేరకు సంగారెడ్డి జిల్లా జోగిపేట, వైద్యశాలలో గురువారం పురుషులకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వసంత్ కుమార్, ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోగిపేట ప్రభుత్వ వైద్యశాలలో మొదటి రోజు పురుషులకు ఐదు మందికి ఒక్కొక్కరికి ఐదు నిమిషాల లోపు కుటుంబనియంత్రణ ఆపరేషన్ చేయడం జరిగిందని, మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయడం వల్ల దాదాపు మూడు నెలల వరకు మహిళలు పనులు చేసుకునే పరిస్థితి ఉండదని, పురుషులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నచో రెండో రోజు నుంచి ఏవైనా పనులు చేసుకోవచ్చని సూచించారు. డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మహేందర్ రెడ్డి, మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు సిబ్బందికి పురుషులకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ గురించి గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోగిపేట, ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ కిరణ్ కుమార్, తాలేల్మ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సత్యనారాయణ, పుల్కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సాయి కిరణ్, నేరేడు గుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శంకర్ చౌహాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ కిరణ్ కుమార్, తాలేల్మ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సత్యనారాయణ, పుల్కల్,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సాయి కిరణ్, నేరేడు గుంట,ప్రాథమిక, ఆరోగ్య కేంద్రం డాక్టర్ శంకర్ చౌహాన్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలోని ఆసుపత్రులు నిభందనలు పాటించాలి

### డా. ఉమా గౌరి, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం డిసెంబర్ 5:**జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహించిన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ అథారిటీ (CEA) సమావేశంలో, జిల్లాలోని ప్రైవేట్ వైద్యసంస్థల్లో సీఈఏ నిబంధనల అమలు, రిజిస్ట్రేషన్/రీన్యువల్ ప్రక్రియ, ఇటీవల నిర్వహించిన పరిశీలనల నివేదికలు మరియు అనుసరణ చర్యలపై సమగ్రంగా చర్చించబడింది.

ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రతి ప్రైవేట్ వైద్యసంస్థ తప్పనిసరిగా CEA రిజిస్ట్రేషన్/రీన్యువల్ పూర్తి చేసుకోవాలి అని అధికారులు స్పష్టం చేశారు.

రిజిస్ట్రేషన్ చేయని సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సందర్భంగా నిబంధనలపై సమగ్ర సూచనలు, CEA నిబంధనలు, రికార్డుల నిర్వహణ, పరిశీలన ప్రమాణాలు, పరికరాలు, మానవ వనరులు, రిజిస్ట్రేషన్‌కు అవసరమైన పత్రాలు



వంటి అంశాలపై వైద్యసంస్థలకు ఇవ్వాల్సిన సూచనలు కమిటీ ద్వారా నిర్ణయించడం జరిగినది.

సమావేశంలో 24 రీన్యువల్ అప్లికేషన్లను కమిటీ పరిశీలించి ఆమోదించి, తదుపరి ఆదేశాల కోసం జిల్లా కలెక్టర్ గారికి పంపడం జరిగింది.మరియు

ఈ సమావేశం లో, PCPNDT, సరోగసి, MTP(మెడికల్ టర్మినేషన్ అఫ్ ప్రెగ్నెన్సీ) అంశాలపై సమగ్రం గా చర్చించడం, తీసుకోవలసిన చర్యలకు గురించి కమిటీ సూచించడం జరిగినది.

ఈ సమావేశానికి

డా. ఉమా గౌరి, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి,

శ్రీ వెంకట రామణ, అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, మల్కాజిగిరి,

శ్రీ ఈ. రవికిరణ్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, కొంపల్లి

డా. వంశీ కృష్ణ, ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధి,

డా. గీత, ప్రోగ్రాం అధికారి, %జజూా ఒూజూ-చీఱ,

వసంత రెడ్డి, డిప్యూటీ డెమో,

సీఈఏ విభాగం సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు

## దేవుని సన్నిధిలో ప్రశాంతంగా కూర్చున్న బిఆర్ఎస్ నాయకులు



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి డిసెంబర్ 5 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ దేవుని సన్నిధిలో ప్రశాంతంగా కూర్చొని ప్రసాదం తినిపిస్తున్న బిఆర్ఎస్ నాయకులు దేవుడు గ్రామ ప్రజలందరినీ ఆశీర్వదించాలని దేవుడు మేలే చేస్తాడని దేవుని ఆశీర్వాదము మా అభ్యర్థి పైన ఉండాలని మంచి మనసుతో దేవుని సన్నిధిలో విశ్రాంతి తీసుకుంటున్నామని పెద్దలు నాయకులు తెలిపారు

# బీసీ నాయకుడు మృతి పట్ల కేంద్రానిదే బాధ్యత

## సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగ్ రావు



హైదరాబాద్ : స్వతహాగా తానే బిసి అని చెప్పుకునే దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశంలోని బీసీలపై సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నారని ప్రజా ఏక్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నర్సింగ్ రావు ఉలుకుందాకర్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బీసీ బిల్లును ఆమోదింపజేసి ఢిల్లీకి పంపించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పందించకపోవడంతో బీసీ నాయకుడు సాయి ఈశ్వర చారి తీవ్ర మనస్థాపానికి గురై ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మృతుడి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ. 5 కోట్లు నష్ట పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలని లేని పక్షంలో పరిస్థితులు తీవ్ర రూపం దాల్చే అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో బిసి నాయకులు వి విజయ్, ఎస్ శ్రీనివాస్ కే రాము, వి శ్రేయాంశ్ చంద్ర, మహిళా నాయకురాలు వి భారతి బాయ్, వి లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు

# వేములవాడలో షార్ట్ సర్క్యూట్ తో 70 క్వింటాళ్ల పత్తి దగ్ధం.

## బాధిత రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు.




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** శుక్రవారం రోజున వేములవాడ పట్టణంలోని భగవంత రావు నగర్ పోస్ట్ ఆఫీస్ వద్ద మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాదాపు 70 క్వింటాళ్ల వరకు ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి పూర్తిగా కాలి బూడిదయింది. పోస్ట్ ఆఫీస్ సమీపంలో నివాసముంటున్న పెరుగు జలంధర్ ఇంటిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఇంట్లో నిల్వచేసిన భారీ మొత్తంలో ఉన్న పత్తి ఉండడంతో మంటలు వేగంగా వ్యాపించి క్షణాల్లోనే పత్తి మొత్తం దగ్ధమైంది. అదృష్టవశాస్తు ప్రాణా నష్టం తప్పింది. ప్రమాదం జరిగిన సమయంలో కుటుంబ సభ్యులందరూ బయట ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల సమాచారంతో వేములవాడ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని గంట పాటు క్షమించి మంటలను పూర్తిగా నియంత్రించారు. కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. దగ్ధమైన పత్తి సుమారు 70 క్వింటాలు ఉంటుందని అంచనా వేశారు. దీంతో రైతు జలంధర్ కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. దీనిపై ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి నష్టపోయిన బాధిత రైతు కుటుంబాన్ని తక్షణమే ఆదుకోవాలని స్థానికులు, రైతు జలంధర్ విజ్ఞప్తి చేశారు.

# బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్ద డబ్బుల బ్యాగును దొంగలించిన నిందితుడి అరెస్ట్, రిమాండ్.

**నిందితుని వద్ద 3,92,500/బినగదు రూపాయలు స్వాధీనం.**

**వివరాలు వెల్లడించిన సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి.**

**నిందితుని వివరాలు:**

**బండారి బాలరాజు తండ్రి పరుశరాములు, (50) నివాసం రుద్రవరం, మండలం వేములవాడ అర్బన్.**




**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** ఈ సందర్భంగా సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి మాట్లాడుతూ వేములవాడ పట్టణానికి చెందిన నార్ల శ్రీనివాస్ హైదరాబాదులోని హోల్ సేల్ దుకాణాలకు చెల్లించాల్సిన 3,97,500/బిరూపాయల నగదు తో పాటు తన ఆధార్ కార్డు, పాన్ కార్డు, హెల్త్ కార్డు, ప్రెస్ అక్రిడేషన్ కార్డు, బస్సు పాస్, రెండు చెక్కులు ఉన్న పర్సును క్యాష్ బ్యాగులో ఉంచుకొని డిసెంబర్ మూడో తేదీ ఉదయం 11:40 నిమిషాలకు వేములవాడ బస్టాండ్ వద్ద బస్సులో ఎక్కారు. లాస్ట్ సీటు కింద బ్యాగ్ ఉంచి కూర్చున్నారు ఆయన కొద్దిసేపటికి ముందు సీటు కు

మారి కూర్చున్నారు.

సుమారు 12:15 గంటలకు తంగళ్ళపల్లి బస్సు స్టాప్ వద్దకు చేరుకునే సరికి వెనుక సీటుకు వెళ్లి చూసినప్పుడు బ్యాగు కనిపించకపోవడంతో కండక్టర్ ను విచారించగా, సిరిసిల్ల వద్ద ఒక వ్యక్తి బస్సు దిగినట్లు చెప్పగా, శ్రీనివాస్ సిరిసిల్ల పట్టణ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకుని పోలీస్ సిబ్బంది వెంటనే రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి వేములవాడ నుండి సిరిసిల్ల వరకు ఉన్న అన్ని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన బండారి బాలరాజుగా గుర్తించి శుక్రవారం రోజు అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుడు తాను వేములవాడలో సిద్దిపేట బస్సులో ఎక్కి వెనుక సీటులో కూర్చున్నట్లు, ఫిర్యాది తన పక్కనే బ్యాగును సీటు కింద పెట్టినట్లు గమనించి అవకాశం దొరికినప్పుడు బ్యాగులో ఉన్న డబ్బులను చూసి దొంగతనం చేయాలని భావించి, సిద్దిపేట టికెట్ తీసుకున్నప్పటికీ చంద్రంపేట వద్ద దిగానని ఒప్పుకున్నాడు. పోలీసులు నిందితుడి వద్ద నుండి మొత్తం నగదును రికవరీ చేసి, నిందితుడిని రిమాండ్ కు తరలించడం జరిగిందని డిఎస్పి నాగేంద్ర చారి తెలిపారు.

బస్సులలో ప్రయాణించేటప్పుడు చుట్టుపక్కల ఉన్న వారిని గమనించి విలువైన వస్తువులు, నగలు మరియు డబ్బులు ఉన్న బ్యాగులను వారి యొక్క చేతిలోనే పట్టుకొని జాగ్రత్తగా ఉండాలని ఇతరులు ఏమైనా తినుబండారాలు గాని వాటర్ గాని ఇస్తే తీసుకోకూడదని తెలిపారు.

చాకచక్యంగా వ్యవహరించి కేసును చేదించిన పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ, సిబ్బంది శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్, నాగరాజు, రవికుమార్ డిఎస్పి నాగేంద్ర చారి అభినందించారు.

# ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందిన సర్పంచ్ అభ్యర్థి.

**ప్రజాసేవ కల నెరవేరక ముందే కన్నుమూత.**

**చింతలటానా ఆర్ అండ్ ఆర్ కాలనీ బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి మృతితో గ్రామంలో తీవ్ర విషాదం.**



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** ప్రజా సేవ చేయాలనే తపనతో, ఎంతో ఉత్సాహంగా సర్పంచ్ ఎన్నికల బరిలో దిగి ప్రచారాన్ని హోరెత్తించిన అభ్యర్థి గెలుపుకు ఒక అడుగు దూరంలో అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందడం వేములవాడ అర్బన్ మండలం చింతల్ తానా ఆర్ అండ్ ఆర్ కాలనీలో తీవ్ర విషాదాన్ని నింపింది. చింతల్ తానా గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ ఎస్సి జనరల్ కు కేటాయించడం జరిగింది. బి ఆర్ఎస్ పార్టీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చర్ల మురళి (50) గురువారం మధ్య రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్ అభ్యర్థిగా బిఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తూ ఎంతో ఉత్సాహంగా గురువారం రాత్రి వరకు ప్రచారం నిర్వహించిన చర్ల మురళి గ్రామస్తులకు ప్రజాసేవ చేసేందుకు ఎన్నో కలలు కన్నాడు. గ్రామాభివృద్ధికి మెరుగైన ప్రణాళికతో ముందుకు సాగుతున్న మురళి అర్ధాంతరంగా మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల సమరం తుది దశకు చేరుకున్న తరుణంలో అభ్యర్థి మరణించడం ఎన్నికల వాతావరణాన్ని పూర్తిగా మార్చివేసింది. ఉదృతంగా కొనసాగుతున్న ప్రచార పర్వం ఒక్కసారిగా నిశ్శబ్ద వాతావరణం లోకి వెళ్ళింది. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్ గా పోటీ చేస్తున్న అభ్యర్థి మరణిస్తే అక్కడ తాత్కాలికంగా ఎన్నికల నిలిపివేసే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థి మృతి వార్తను స్థానిక అధికారులు కలెక్టర్ కు సమాచారం అందించడం జరిగింది. ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు సర్పంచ్ ఎన్నిక జరగడమా, లేదా ఆపడమా అనేది తెలియాల్సి ఉంది.

# జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై పార్లమెంట్ లో ప్రస్తావించిన ఈటల రాజేందర్




న్యూఢిల్లీ డిసెంబర్ 5 మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై నేడు పార్లమెంట్ లో ఎంపీ శ్రీ ఈటల రాజేందర్ ప్రస్తావించారు. 40 లక్షల ఓటర్లతో 70 లక్షల జనాభా కలిగిన మల్కాజిగిరి పార్లమెంట్ లోని జవహర్ నగర్ లో 40 ఏండ్ల కిందట డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేశారు అప్పుడు ఒకటి రెండు చెత్త వాహనాలు వచ్చి చెత్త వేసేవి కానీ ఇవాళ 10వేల టన్నుల చెత్తను ఒకే చోట వేస్తున్నారు. 30 కి.మీ. చుట్టూ అక్కడ నివసిస్తున్న లక్షల మంది ప్రజలు డంపింగ్ యార్డ్ నుండి వచ్చే దుర్వాసన, కీటకాల వల్ల చాలా మంది అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఒకే చోట ఇంత పెద్ద డంపింగ్ యార్డ్ ఉండొద్దని 1.5 కోట్ల జనాభా ఉన్నా హైదరాబాద్ నగరంలో నాలుగు మూలల డంపిగ్ యార్డులు ఏర్పాటు చేయాలని 2017 నుండి చాలాసార్లు చెన్నైలో ఉన్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది. అయినా ఇప్పటివరకు ఎటువంటి పరిష్కారం చూపలేదు. గౌరవ పర్యావరణ శాఖ మంత్రిగారు ఈ సమస్యను వారి దృష్టిలో పెట్టుకొని ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును త్వరగా అమలు చేసి మా జవహర్ నగర్ మరియు చుట్టూ ప్రాంతాల ప్రజలను ఈ సమస్య నుండి దూరం చేయాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.

# పట్లూర్ కాంగ్రెస్ అధికార పార్టీ అభ్యర్థి పరుశు రాముని గెలిపిద్దాం






వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి డిసెంబర్ 5 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా: మర్పల్లిమండలం పట్లూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పరు శురాం గెలుపు దిశలో ఉన్నారని మర్పల్లి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ తెలిపారు అన్ని వర్గాల ప్రజలు మమేకమై అధికార పార్టీ అయినా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తామని ప్రజలు హర్షం వ్యక్తం చేసినట్టు తెలిపారు

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక దృష్టి

## శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా అన్ని వర్గాల ప్రజలు సహకరించాలి

## జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల,ప్రజాస్వామ్య వ్యవస్థను బలపరిచే ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో సాగేందుకు పోలీస్ శాఖ పరంగా కావలసిన భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.. శుక్రవారం ఇబ్రహీంపట్నం,మెట్ పల్లి, మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ స్వయంగా పరిశీలించి భద్రత పరంగా చేయవలిసిన ఏర్పాట్ల గురించి అదికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రల దగ్గర ప్రహరీ గోడ, కరెంట్, వాటర్ మొదలగునవి ముందస్తు అవసరాలు అక్కడ ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... మొదటి విడత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక దృష్టి సాధించడం జరిగిందని అన్నారు. మొదటి విడతకు సంబంధించిన 122 గ్రామాలు ,1172 వార్డ్ లలోఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని దీనికి సంబంధించి మొత్తం 1172 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎన్ ఎస్ఎస్ 163 ఆక్ట్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు.ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించారు. ప్రజలంతా ఎలక్షన్ సమయంలో పోలీసు వారికి సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎస్పీ వెంట మెట్ పల్లి, కోరుట్ల సి.ఐ లు అనిల్ కుమార్ ,సురేష్ ,ఎస్.ఐ లు అనిల్ కిరణ్ కుమార్, శ్రీధర్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

